
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

మంగళవారం, 22 జూలై 2025

ఆహార భద్రత కల్పనలో
రోల్ మోడల్‌గా రాష్ట్రం

- అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నాం
- దశాబ్ద కాలంగా ప్రజలు ఎదురు చూసిన రేషన్‌కార్డులిస్తున్నాం
- దళితులు.. తాము చేసే పనికి యాజమానులవ్వాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- బోనకల్, చింతకాని మండలాల్లో పర్యటన
- జోరు వానలోనూ కార్యక్రమాలకు హాజరు

బోనకల్ /చింతకాని, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆహారభద్రత కల్పనలో రాష్ట్రం దేశానికి రోల్‌మోడల్ కానుందని, అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని, దశాబ్దకాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న రేషన్‌కార్డులను ఇస్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా బోనకల్, చింతకాని మండలాల్లో పర్యటించారు. చింతకాని మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగిందని, గత పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన వారు ఈ అంశాన్ని పట్టించుకోలేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది

(మిగతా 6వ పేజీలో)



బోనకల్‌లో ఆహార భద్రత కార్డులను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం మార్కెట్‌ను
సంక్రాంతికి ప్రారంభిస్తాం

- డిసెంబరు ఆఖరు కల్లా పనులు పూర్తి చేయండి
- ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల
- రూ.155.30 కోట్లతో చేపట్టిన కొత్త మార్కెట్ పనుల పరిశీలన

ఖమ్మం, జూలై 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : రూ.155.30కోట్లతో 15.39ఎకరాల్లో అత్యాధునిక పరిజ్ఞానంతో.. ప్రపంచస్థాయి నాణ్యత ప్రమాణాలతో ఖమ్మంలో నిర్మిస్తున్న అధునాతన మోడల్ వ్యవసాయ మార్కెట్‌ను వచ్చే సంక్రాంతి పర్వదినాన ప్రారంభిస్తామని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నిర్మాణ పనులను డిసెంబరు కల్లా పూర్తిచేయాలని రైతుల పండుగ అయిన సంక్రాంతి రోజున వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు, అమ్మకాలకు శ్రీకారం చుట్టాలని ఆయన అధికారులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన పలుశాఖల అధికారులతో కలిసి పాత మిర్చి మార్కెట్ స్థానంలో నిర్మిస్తున్న వ్యవసాయ మార్కెట్ పనులను పరిశీలించారు. మార్కెట్‌లోని షెడ్లు, రైతులు, వ్యాపారులు,

(మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో నూతనంగా నిర్మిస్తున్న వ్యవసాయ మార్కెట్ భవనాల పనులు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

25 నుంచి రేషన్ కార్డుల పంపిణీ

- భారీ వర్షాలతో జరిగే ప్రమాదాలను నివారించాలి
- సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి
- వీసీలో కలెక్టర్లకు సీఎం రేవంత్ ఆదేశాలు
- బోనకల్ నుంచి భట్టి, ఖమ్మం కలెక్టరేట్ నుంచి తుమ్మల హాజరు

7



ఉధృతంగా ప్రవహిస్తున్న తల్లాడ మండలంలోని మాచవరం వాగు

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వాన

- పంటలకు ఊపిరి పోసిన వర్షం
- భద్రాద్రి జిల్లా పినపాకలో పిడుగుపాటుకు మహిళ మృతి
- ఖమ్మంలో రోడ్లపైకి పొంగిపొర్లిన నీరు
- మధిర మల్లారంలో ఆరు పాడిగేదెలు గల్లంతు

7



పిడుగుపాటుతో మృతిచెందిన కొమరం రమణ (ఫైల్)

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రసవాలకు సంబంధించి 15శాతం మందికే శస్త్రచికిత్సలు అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కానీ కాన్పులకు శస్త్ర చికిత్సలు చేస్తున్న శాతం మాత్రం రోజురోజుకీ పెరుగుతోంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 67శాతం ఆపరేషన్లు జరుగుతున్నట్టు తాజాగా వైద్యఆరోగ్య శాఖ ఇచ్చిన నివేదికలో వెల్లడైంది. అయితే దీనికి గర్భిణుల ఆరోగ్య పరిస్థితులు కొంత మేరకు కారణం అవుతున్నా.. కొందరు ప్రైవేటు వైద్యులు కాసులకు కక్కుర్తి పడుతున్నట్టు తెలుస్తోంది.



ఆపరేషన్ ద్వారా కాన్పు చేసే విధానం

కక్కుర్తి 'కోత'!

- సాధారణ ప్రసవాలను మరుస్తున్న వైద్యులు
- అవసరం లేకపోయినా శస్త్ర చికిత్సలకే ప్రాధాన్యం
- 67 శాతం ఆపరేషన్లు జరుగుతున్న జిల్లాగా ఖమ్మం
- వైద్య, ఆరోగ్యశాఖ నివేదికతో వెలుగులోకి
- ప్రైవేటులో అయితే మరీ దారుణ పరిస్థితులు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఒక వైపు శిశు మరణాలు రేటు తగ్గించడం.. మరోవైపు గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసికట్టుగా పనిచేస్తున్నాయి. ఇందుకోసం ఏటా రూ.కోట్లు నిధులు వెచ్చిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడడం సాధ్యమైనంత వరకు సహజ ప్రసవాలు జరిగేలా చూడడం .. శస్త్ర చికిత్సలు తగ్గించాలన్నది లక్ష్యం. కానీ క్షేత్రస్థాయిలో ఇది సఫలమవడం లేదు. దీనికి జిల్లాలో తాజా గణాంకాలే నిదర్శనం. జిల్లాలో ఈ ఏడాది జూలై 21 వరకు 67శాతం మందికి శస్త్రచికిత్సలు చేసినట్టు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం 25ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, నాలుగు కమ్యూనిటీ ఆస్పత్రులు, జిల్లా కేంద్రంలో జిల్లా ఆస్పత్రి, మరో నాలుగు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులు కూడా 300లోపు ఉన్నాయి. వీటిన్నంటిలో ఈ ఏడాది ఇప్పటి వరకు 6,448 కాన్పులు జరగ్గా వాటిలో 2,071 సాధారణ.. 4377మందికి సీ సెక్షన్ ద్వారా కాన్పులు చేశారు.

శస్త్ర చికిత్సలకే ప్రాధాన్యం

ప్రసవాల సమయంలో అత్యధికంగా ప్రైవేటులో శస్త్రచికిత్సలకు ప్రాధాన్యమిస్తున్నారు. వాస్తవానికి గతంతో పోలిస్తే ప్రస్తుతం సహజ ప్రసవాలు చేసే పరిస్థితులు లేవు. పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే సహజ ప్రసవం జరిగేందుకు ప్రయత్నిస్తున్నారు. పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అనస్తీషియన్లు (మత్తువైద్యులు) లేకపోవడంతో సహజ ప్రసవాలకే ప్రాధాన్యమిస్తున్నారు. ఉన్నచోట అందుబాటులో లేకుండా సహజ ప్రసవం జరుగుతుందేమో ఎదురుచూసే పరిస్థితులున్నాయి. కానీ ప్రైవేటులో ఇలాంటి పరిస్థితి లేదు. సహజ ప్రసవానికి ఎక్కువ సమయం తీసుకోవడం వల్ల పలు సమయాల్లో గర్భిణులు శిశువుల ప్రాణాలమీదికి వస్తున్న నేపథ్యంలో జరగరానిది జరిగితే ఎక్కడ చెడ్డపేరు వస్తుందని (మిగతా 6వ పేజీలో)

అవగాహన కల్పిస్తున్నాం

డాక్టర్ కళావతిబాయి, ఖమ్మం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి



జిల్లాలో ప్రెగ్నెన్సీ రిజిస్ట్రేషన్ సమయంలో సాధారణ కాన్పులపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేయించుకునే విధంగా వైద్య ఆరోగ్యసిబ్బంది కృషిచేస్తున్నాం. దురదృష్టవశాత్తు కేసులు ప్రైవేటుకు వెళ్తున్నాయి. అక్కడ ఆస్పత్రుల్లో గర్భిణుల కుటుంబీకులు చెప్పిన విధంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. వీటిపై ఆయా ఆస్పత్రులకు నోటీసులిస్తున్నాం. మరో మారు అధికంగా సీ సెక్షన్లు జరిపిన ఆస్పత్రులను గుర్తించి వారి నుంచి వివరణ తీసుకోనున్నాం.

ఈ ఏడాది ఇప్పటి వరకు ఖమ్మం జిల్లాలో ప్రసవాల గణాంకాలు ఇలా...

నెల	ప్రభుత్వ సాధారణం	సీ సెక్షన్	మొత్తం	ప్రైవేటు సాధారణం	సీ సెక్షన్	మొత్తం
జనవరి	217	236	453	158	541	699
ఫిబ్రవరి	168	160	328	119	455	574
మార్చి	179	209	388	122	500	622
ఏప్రిల్	216	181	397	123	470	593
మే	214	225	439	125	482	607
జూన్	193	203	396	100	416	516
జూలై	109	127	236	28	172	200
మొత్తం	1, 296	1,341	2,637	775	3,036	3,811

విద్యుదుత్పత్తికి రెడీ

పాలేరు జలవిద్యుత్ కేంద్రంలో పూర్తయిన మరమ్మతులు



కూసుమంచి మండలం పాలేరు జల విద్యుత్‌కేంద్రం, ప్రాజెక్టులోని జనరేటర్లు

కూసుమంచి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలవిద్యుత్ కేంద్రం విద్యుదుత్పత్తికి సిద్ధమైంది. పాలేరు జలాశయం నుంచి ఎడమ కాల్వకు పూర్తిస్థాయిలో ఎప్పుడు నీరు వదిలినా రెండు యూనిట్ల ద్వారా రెండు మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రారంభించేలా అధికారులు మరమ్మతులు పూర్తి చేశారు. గత సెప్టెంబరు ఒకటిన కురిసిన భారీ వర్షాల కారణంగా జలవిద్యుత్ కేంద్రం వరదపాలైన సంగతి తెలిసిందే. ప్రధానకాల్వ ద్వారా వరద పోటెత్తడంతో ప్రాజెక్టు పూర్తిగా నీటమునిగింది. విద్యుతుత్పత్తి చేసే రెండు జనరేటర్లు, మోటార్లు మొత్తం నీటమునిగి ఒండు చేరింది. కాల్వకు మూడుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో ప్రాజెక్టుకు తీవ్ర నష్టం కలిగింది. దీంతో జెన్‌కో అధికారుల ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సివిల్ పనులకు రూ.1.50 కోట్లు, మెకానికల్ పనులకు రూ.50 లక్షలు మొత్తం రూ.2 కోట్లు మంజూరు చేసింది.

మరమ్మతులు పూర్తి

పాలేరు జలాశయం నుంచి హైడల్ ప్రాజెక్టు వరకు కట్టలను పటిష్టం చేశారు. వెనుక భాగంలోనూ కట్ట కోతకు గురవగా.. దానినీ పటిష్టం చేశారు. కట్టకు లైనింగ్ పనులు పూర్తిచేశారు. అదేవిధంగా గేటువద్ద నుంచి ప్రాజెక్టు వరకు సీసీ రోడ్డు నిర్మించారు. రెండు జనరేటర్లు నీటమునగగా వాటిని మరమ్మతు చేశారు. మిషన్ హాల్లోని ప్యానల్ బోర్డులు, రిలేస్, బ్రేకర్లు, మొత్తం కాంటాక్ట్‌లను కొత్తవి అమర్చారు. ప్రాజెక్టుకు చరిత్రలో లేని విధంగా వరదలో మునిగిపోవడంతో గతేడాది మొత్తం విద్యుదుత్పత్తికి ఆటంకం కలిగింది. ప్రాజెక్టు పూర్తిగా నడవలేదు. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి విద్యుదుత్పత్తికి సిద్ధంగా ఉంచారు.

విద్యుదుత్పత్తి జరగాలంటే...

పాలేరు జలాశయానికి, సాగర్ ఎడమకాల్వకు అనుసంధానంగా పాలేరు జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించారు. 23 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం కలిగిన పాలేరు జలాశయంలో కనీసం 18 అడుగుల మేర నీరు నిల్వ ఉంచడంతోపాటు, కాల్వలో కనీసం 2400 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్న సమయంలో రెండు యూనిట్ల ద్వారా రెండు మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. జలాశయం నీటిమట్టానికి, కాల్వలో నీటిమట్టానికి కనీసం 8 అడుగుల వ్యత్యాసం ఉండటంతో కాల్వ నీటి ప్రవాహం, జలాశయంలో నీటి ఒత్తిడితో టర్బైన్‌లపై ప్రెజర్ పెరిగి విద్యుదుత్పత్తి జరిగే విధంగా ప్రాజెక్టు నిర్మించారు. బయట మార్కెట్‌లో రూ.4 నుంచి 8 వరకు ఒక్క యూనిట్ విద్యుత్ కొనుగోలు చేస్తుండగా, పాలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఒక్క యూనిట్‌కు అతి తక్కువగా రూ.0.50 పైసలు మాత్రమే ఖర్చవుతుంది. పాలేరు జలాశయంలో ప్రస్తుతం 15.5 అడుగుల మేర నీరు మాత్రమే నిల్వ ఉంది. ఎడమకాల్వకు 710 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



నీరు ఎప్పుడు వదిలినా.. విద్యుదుత్పత్తికి సిద్ధం..

ఎస్ఈ దేశ్యానాయక్

పాలేరు జల విద్యుత్ కేంద్రం విద్యుదుత్పత్తికి సిద్ధంగా ఉంది. జలాశయం నుంచి ఎడమకాల్వకు ఎప్పుడు 2400 క్యూసెక్కుల నీరు వదిలినా రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి ప్రారంభిస్తాం. కనీసం 1250 క్యూసెక్కుల నీరు వదిలితే ఒక యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తి ప్రారంభిస్తాం. అందుకు పూర్తి ఏర్పాట్లు చేశాం.



యూరియా లేక ఖాళీగా ఉన్న కొత్తగూడెం మార్కెట్ యార్డ్‌లోని సొసైటీ గోదాం



యూరియా కోసం ఇటీవల జూలూరుపాడు సొసైటీ కార్యాలయానికి వచ్చిన రైతులు

యూరియా.. వెతలు!

- రైతుల అవసరం.. వ్యాపారుల అక్రమం..
- ఎరువులు కొంటేనే యూరియా అట..
- భద్రాద్రి జిల్లాలో సొమ్ము చేసుకుంటున్న ప్రైవేట్ డీలర్లు..
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

కొత్తగూడెం అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కృత్రిమ కొరత తలెత్తుతోంది. సింగిల్ విండోలు నిధులు లేవన్న సాకుతో తమకు కేటాయించిన దానికి అనుగుణంగా యూరియా తెప్పించుకోలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు యూరియా కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. వ్యవసాయ శాఖ రైతుల అవసరం మేరకు నెలవారీగా యూరియాను దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుత వర్షాకాలానికి జిల్లాలో 13,655 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా.. నేటివరకు 6300 మెట్రిక్ టన్నులు తెప్పించింది. దీనికి తోడు సొసైటీలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు కేటాయించిన స్థాయిలో యూరియాను తెప్పించడం లేదు. యూరియా కోసం ముందే నగదును డీడీ రూపంలో చెల్లించాలి. తమ వద్ద నగదు నిల్వ లేదని సాకు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎరువుల దుకాణాల్లో యూరియా (మిగతా 6వ పేజీలో)

యోగితారాణా పర్యటన
రేపటికి వాయిదా

23, 24న ఇరు జిల్లాల్లోని పలు పాఠశాలల సందర్శన



కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ సెక్రటరీ, మాన్యోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యోగితారాణా కొత్తగూడెం పర్యటన బుధవారానికి వాయిదా పడింది. వాస్తవానికి ఆమె పర్యటన మంగళవారం ఉన్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆమె బుధవారం ఉదయం 10:30గంటలకు ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీలో సమీక్ష, 2గంటలకు కొత్తగూడెం శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల తనిఖీ, 3:30 గంటలకు భవిత సెంటరులో ఉపాధ్యాయులు, విద్యార్థులతో భేటీ, 4:30గంటలకు కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ, సాయంత్రం 6:30 గంటలకు బూర్గంపాడులోని రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శిస్తారు. రాత్రి అక్కడ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారు. మరుసటి రోజు గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న ఆమె ఉదయం 9 గంటల నుంచి 1:30 గంటల వరకు ఖమ్మంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలను సందర్శించనున్నారు. మధ్యాహ్నం 1:30 గంటలకు డైట్ కళాశాల సందర్శన, 3:30 గంటల నుంచి 5 గంటల వరకు ఖమ్మం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 5గంటలకు మోడల్ స్కూల్ సందర్శన ఉంటుంది. ఆమె వెంట పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్, గురుకుల పాఠశాలల కార్యదర్శి రమణకుమార్, జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్, కేజీబీవీ పాఠశాలల కో ఆర్డినేటర్ డాక్టర్ హెచ్.శ్రీహరి తదితర అధికారులు రానున్నారు.

ఆయిల్‌ఫెడ్ ద్వారా పామాయిల్ రైతులకు

రాయితీపై మందులు అందించాలి

మంత్రి తుమ్మలకు వినతి

దమ్మపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): పామాయిల్ రైతులకు ఆయిల్‌ఫెడ్ ద్వారా మందులను రాయితీపై అందజేయాలని కోరుతూ పామాయిల్ సలహా మండలి సభ్యుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లో సోమవారం కలిసి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ ఉప ఉత్పత్తుల్లో పీచు, మక్కు, నట్స్ వ్యర్థాల ద్వారా వచ్చే ఆదాయంలో రైతుల వాటాను నిర్ధారించాలని కోరారు. ఈ వాటా ద్వారా వచ్చిన నగదుతో పామాయిల్ రైతులకు రాయితీపై బోరాన్, మెగ్నిషియం, సల్ఫర్‌తో పాటు జ్ఞానోడర్మా మందులను అందించాలన్నారు. పామాయిల్‌కు తెగులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా ట్రైకోడెర్మా మందులను ఆయిల్‌ఫెడ్ పర్యవేక్షణలో రైతులకు అందించేలా విధంగా సిబ్బందితో చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయిల్‌ఫెడ్ ద్వారా రాయితీపై మందులు అందించటం ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. దీంతోపాటు పాయిల్ తోటలలో జ్ఞానోడర్మా తెగులు సోకకుండా నివారించటంతో పామాయిల్ దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ విషయంపై వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించి ప్రిన్సిపల్ సెక్రెటరీతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆలపాటి తెలిపారు.

ఈవోపై దాడి చేసినా స్పందించరేం?

రామయ్య భూముల సమస్య పరిష్కారం పట్టదా..

ఇరు రాష్ట్రాల మంత్రులను ప్రశ్నించిన సనాతన జేఏసీ అధ్యక్షుడు

భద్రాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిపై ఏపీలోని పురుషోత్తపట్నంలో ఆక్రమణదారులు దాడి చేసిన ఘటనపై తెలుగు రాష్ట్రాలకు చెందిన మంత్రులు స్పందించరేమిటని సనాతన జేఏసీ అధ్యక్షుడు, హిందూ సంఘాల నాయకుడు తురగా శ్రీరామ్ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన భద్రాచలంలో మీడియా ప్రతినిధులకు వీడియో సందేశాన్ని పంపారు. రామయ్య భూములలో ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్న క్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవోపై దాడి జరిగింది. ఈ దాడి ఘటనపై తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి, ఏపీ హోం మంత్రి నేటికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సమంజసం కాదన్నారు. సంబంధిత బాధ్యులపై చట్టపరంగా ఎటువంటి చర్యలు తీసుకున్నారని ఏపీ హోంమంత్రిని ప్రశ్నించారు. ఇరు రాష్ట్రాల మంత్రులు దేవాలయ భూముల సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం పట్ల ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

రోళ్లపాడులో కుల బహిష్కరణ కలకలం

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

విచారణ చేపట్టిన ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భూ వివాదం విషయంలో టేకులపల్లి మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని.. కుల పెద్దలు కుల బహిష్కరణ చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. భూ వివాదం నేపథ్యంలో రోళ్లపాడు గ్రామానికి చెందిన పూనెం రామస్వామి, వెంకటరమణ దంపతులను కులం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆదివారం రాత్రి గ్రామంలో మైక్‌ద్వారా చాటింపు వేశారు. దీంతో రామస్వామి, ఆయన భార్య వెంకటరమణ తమకు న్యాయం చేయాలని సోమవారం టేకులపల్లి పోలీసులను ఆశ్రయించారు. గ్రామంలోని తమకు చెందిన ఆర్వోఎఫ్ఆర్ పట్టా భూమిని కొడెం ముత్తయ్య, ఆయన కుమారులు మోహన్, సునీల్ దౌర్జన్యంగా ఆక్రమించుకొని వ్యవసాయ బోరు వేసుకొన్నారని ఆరోపించారు. దీనిపై పంచాయితీలు జరుగుతుండగా.. స్థానిక పెద్ద మనుషులు ముత్తయ్యకు వత్తాసు పలుకుతూ తమ కుటుంబాన్ని బహిష్కరించారని వారు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ సురేష్, ఎస్ఐ రాజేందర్ రోళ్లపాడు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ గ్రామంలో కుల బహిష్కరణలు చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. భూ వివాదాలను గ్రామస్తులు రెవెన్యూ, అటవీ అధికారుల సలహాలు, సూచనలు పాటించి పరిష్కరించుకోవాలని సూచించారు.

నవోదయలో క్రీడా సంరంభం

రేపటి నుంచి క్లస్టర్ స్థాయి ఆటల పోటీలు

తరలిరానున్న వివిధ జిల్లాల విద్యార్థులు



పాలేరు జవహర్ నవోదయ విద్యాలయం

కూసుమంచి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పాలేరు జవహర్ నవోదయ విద్యాలయం క్లస్టర్‌స్థాయి క్రీడాపోటీలకు సిద్ధం అయింది. ఈనెల 23, 24 తేదీల్లో జరుగనున్న క్రీడాపోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైద్రాబాద్, వరంగల్‌తో పాటు ఆతిధ్య ఖమ్మం జిల్లా పాలేరు నవోదయ విద్యాలయాల నుంచి దాదాపు 350మందికి పైగా క్రీడాకారులు పాల్గొననున్నారు. విద్యార్థులతో పాటు ఎస్కార్టు టీచర్లు హాజరుకానున్నారు. క్లస్టర్‌మీట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రీజనల్ మీట్‌కు ఎంపిక చేయనున్నారు. 'క్లస్టర్‌మీట్‌ను పురస్కరించుకుని నవోదయను ముస్తాబు చేశారు.

మూడు విభాగాల్లో పోటీలు

క్లస్టర్‌స్థాయిలో మూడు విభాగాల్లో బాల, బాలికలకు అండర్-14, అండర్-17, అండర్-19 పోటీలు జరుగనున్నాయి. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చదరంగం, యోగా పోటీలను నిర్వహించనున్నారు. ఆయా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారిని రీజనల్ మీట్‌కు ఎంపిక చేస్తారు.



పోటీలకు సర్వం సిద్ధం : ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

పాలేరు జవహర్ నవోదయ విద్యాలయం లో బుధవారం నుంచి రెండు రోజుల పాటు జరుగనున్న క్లస్టర్ మీట్‌కు సర్వంసిద్ధం చేశాం. క్రీడాపోటీలు నిర్వహించేందుకు గ్రౌండ్‌ను కూడా సిద్ధం చేయడం జరిగింది. వివిధ జిల్లాల నుంచి సుమారు 350 మంది వరకు విద్యార్థులు పాల్గొననుండటంతో వారికి అవస రమగు వసతి సౌకర్యాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం.

వెంటపల్లి కార్టూన్‌కు జాతీయ అవార్డు



మండలి బుద్ధప్రసాద్ నుంచి అవార్డు అందుకుంటున్న వెంటపల్లి సత్యనారాయణ



అవార్డు సాధించిన గ్రంథాలయ చిత్రం

వైరా, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ కార్టూన్ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా ఖజానాశాఖ అధికారి వెంటపల్లి సత్యనారాయణకు అవార్డు లభించింది. వైరాలో ఏటీవోగా, ఖమ్మంజిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన సత్యనారాయణ ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా డీటీవోగా పనిచేస్తున్నారు. సుప్రసిద్ధ సాహితీవేత్త మామిడిపూడి రామకృష్ణయ్య స్మారకార్థం విశాలాక్షీ మాసపత్రిక 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయస్థాయి కార్టూన్ పోటీల్లో గ్రంథాలయాలు నేటి స్థితిపై వెంటపల్లి వేసిన కార్టూన్‌కు అవార్డు లభించింది. ఆదివారం రాత్రి ఏపీలోని నెల్లూరు జిల్లా టౌన్ హాల్‌లో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ వేడుకల్లో ఏపీ మాజీ ఉపసభాపతి, అధికార భాషాసంఘం అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, కార్పొరేషన్ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. వెంటపల్లి చిత్రకళ, కార్టూన్ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో 30కి పైగా అవార్డులు అందుకున్నారు. ఇప్పుడు జాతీయస్థాయి అవార్డు అందుకున్న వెంటపల్లిని ఆ శాఖ ఉద్యోగులు అభినందించారు.

'మీసేవ' అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ముళ్లపాటి

వైరా, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా మీసేవ అసోసియేషన్ అధ్యక్షుడిగా వైరాలో మీసేవ నిర్వాహకుడు ముళ్లపాటి సీతరాములు ఎన్నికయ్యారు. ఆదివారం ఖమ్మంలో తెలంగాణ మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీతరాములును జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన్‌ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సీతరాములును శాలువాతో సన్మానించి అభినందించారు.



ముళ్లపాటి సీతరాములును సన్మానిస్తున్న దృశ్యం

సాగర్ జలాలను వెంటనే విడుదల చేయాలి

డిమాండ్ మేరకు యూరియా అందించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 21(ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టులో వరి నాట్లు వేస్తున్న కారణంగా సాగర్ జలాలను వెంటనే విడుదల చేయాలన్నారు. వ్యవసాయ పంటల డిమాండ్ మేరకు యూరియా పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో సాగర్ జలాలు విడుదల చేసి వానాకాలం పంటలను ఆదుకోవాలని కోరారు. జిల్లా మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకొని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సొసైటీల్లో యూరియా నిల్వలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్‌గా మారి యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఆగస్టు 12 నుంచి సెప్టెంబరు 12 వరకు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరి వర్ధంతి సభలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బండి రమేశ్, వై.విక్రమ్, బొంతు రాంబాబు, మాదినేని రమేశ్, యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమష్టి నిర్ణయాలతో ప్రజా సమస్యలపై పోరాటాలు జరపాలి

పువ్వాడను కలిసిన సీపీఐ నూతన కార్యదర్శి, సహాయ కార్యదర్శి



పువ్వాడను సన్మానిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సమష్టి నిర్ణయాల మేరకు ప్రభుత్వాలు చేపట్టే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటాలు జరపాలని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు సూచించారు. జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శులుగా నూతనంగా ఎన్నికైన దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి సోమవారం పువ్వాడను కలిసి సన్మానించారు. అనంతరం గిరిప్రసాద్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా ఎన్నికైన వారిని రాష్ట్ర అధ్యక్షుడు కూనంనేని, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అభినందించారు.

ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్లపై

సస్పెన్షన్ ఎత్తివేయాలి

విద్యార్థినుల ధర్నా

భద్రాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎ.పద్మావతి, రాజేశ్వరిలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని విద్యార్థినులు సోమవారం గురుకుల కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. రెండు రోజుల క్రితం కళాశాలలో విద్యార్థులకు అల్పాహారంగా ఇచ్చిన పొంగలిలో పురుగులు రావడంతో ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో ఐటీడీఏ పీవో బి.రాహుల్ విచారణకు ఆదేశించారు. గురుకులాల ఆర్సీవో అరుణకుమారి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి నివేదికను అందజేశారు. ఈ క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి, డిప్యూటీ వార్డెన్ రాజేశ్వరిలను సస్పెండ్ చేస్తూ గురుకులాల కార్యదర్శి బి.సీతాలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విద్యార్థులు ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.

కక్కుర్తి 'కోత'!

(5వ పేజీ తరువాయి)

సాధ్యమైనంత వరకు శస్త్రచికిత్సలకు ప్రాధాన్యమిస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో వైద్యులు అవసరం ఉన్నా లేకున్నా ఎడాపెడా వారి వద్దకు వచ్చే ప్రతీ కేసునీ శస్త్రచికిత్స చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి 1 నుంచి జూలై 21 వరకు మొత్తం 6,448 ప్రసవాలు జరిగితే ఇందులో ప్రైవేటులో 3036 సిజేరియన్లు చేశారు. కేవలం 775 మాత్రమే సాధారణ కాన్పులు చేశారు. అంటే నాలుగు రెట్లు అధికంగా ఆపరేషన్ల ద్వారా కాన్పులు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 1341 సిజేరియన్లు చేశారు. ప్రైవేటులో 79శాతం సిజేరియన్లు చేయగా ప్రభుత్వ ఆస్పత్రిలో 50శాతం మందికి ఆపరేషన్ ద్వారా కాన్పులు చేశారు. మొత్తంగా జిల్లాలో 67శాతం కాన్పులు సీ సెక్షన్‌ద్వారా జరిగాయి.

మరి నోటీసులు ఏమైనట్టు?

ప్రసవాల్లో శస్త్రచికిత్సల శాతాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం, ఇటు జిల్లా అధికారులు ప్రతి సమావేశంలో ఆదేశాలు జారీ చేస్తున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం వీటిపై అంతగా దృష్టి సారించడం లేదు. అన్ని ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేయాలని విధిగా ప్రభుత్వ వైద్యులకు అధికారులకు లక్ష్యాన్ని కూడా కేటాయిస్తున్నారు. నిత్యం ప్రగతిని పరిశీలిస్తున్నా ఉన్నతాధికారుల ఆదేశాలు మాత్రం అమలవడం లేదు. వైద్యాధికారులు, సిబ్బందిలో నిర్లక్ష్యం కారణంగా ఈ కేసులు ఎక్కువగా పెరుగుతున్నాయని తెలుస్తోంది.

మహిళలకు ఇబ్బందికరమే!

శస్త్రచికిత్సల వల్ల మహిళలకు భవిష్యత్తులో ఆరోగ్యపరమైన సమస్యలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్య నిపుణులు ఆధారంగా అత్యవసరం అయితే తప్ప కేవలం 15శాతం మందికే శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తుందంటున్నారు. ప్రసవాల సమయంలో మహిళలకు ఇచ్చే మత్తుమందు నేరుగా వెన్నుముకకు ఇస్తారు. దీని ప్రభావం 10 నుంచి 15 ఏళ్ల తర్వాత తప్పనిసరిగా చూపిస్తోంది. కొందరిలో చాలా త్వరితగతిన చూపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. దీంతో తీవ్రమైన నడుమునొప్పితో బాధపడాల్సి వస్తోంది.



ఆహార భద్రత కల్పనలో రోల్ మోడల్‌గా రాష్ట్రం

(5వ పేజీ తరువాయి)

కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 93లక్షల కుటుంబాలకు ఆహారభద్రత కార్డులను పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గృహలక్ష్మీ పథకం కింద 51లక్షల మంది లబ్ధి పొందుతున్నారని, ఆరోగ్యశ్రీ కింద 93లక్షల కుటుంబాలకు పదిలక్షల వరకు ఉచిత వైద్య సదుపాయాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కేవలం 9 రోజుల్లోనే రూ.9వేల కోట్ల రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం, మూడు నెలల వ్యవధిలోనే రూ.2లక్షల వరకు రుణమాఫీ కింద రూ.21వేల కోట్లును బ్యాంకులకు చెల్లించామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పేద పిల్లలకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రవేశ పెడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, డీసీసీబీ, ఆత్మ కమిటీ చైర్మన్లు దొండపాటి వెంకటేశ్వరరావు, కర్నాటి రామకోటేశ్వరావు, డీఎస్‌వో చందన్ కుమార్, తహసీల్దార్ ఎం.రమాదేవి, ఎంపీడీవో ఆర్.రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, జిల్లా నాయకుడు పైడిపల్లి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్లు పక్కదారి పట్టొద్దు..

చింతకాని మండలం గాంధీనగర్, చింతకాని మండలకేంద్రంలో ఆయన జోరువానలోనూ పర్యటించారు. తొలుత గాంధీనగర్‌లో ఓ లబ్ధిదారుడికి చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. లబ్ధిదారులు త్వరతగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం ఇందిరమ్మ ఇళ్ల నిధులు మంజూరు చేయనున్నామన్నారు. అనంతరం రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం చింతకాని మండల కేంద్రంలోని రైతు వేదికలో దళితబంధు పథకం రెండో విడతలో భాగంగా రూ.4.63 కోట్లతో 214 మంది లబ్ధిదారులకు మంజూరైన దళితబంధు యూనిట్లను ఆయన పంపిణీ చేశారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరలో యూనిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దళితబంధు యూనిట్లను విక్రయించడం, కొనుగోలు చేయడం నేరమన్నారు. దళితులు ఇచ్చిన యూనిట్లను వినియోగించుకుని కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యం, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, ఎస్సీ కార్పొరేషన్ డీడీ కస్తాల సత్యనారాయణ, ఈడీ నవీన్‌బాబు, డీఎస్‌వో చందన్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి, అంబటి వెంకటేశ్వర్లు, మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, వంగూరి రమేష్, ఓర్సు వీరభద్రం తదితరలు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌ను

సంక్రాంతికి ప్రారంభిస్తాం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(5వ పేజీ తరువాయి)

అధికారుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలు, ఎక్కడెక్కడ ఏం నిర్మిస్తున్నారు? తదితర పనుల గురించి ఆరాతీశారు. గాలిదుమారాలు, వర్షాలకు పంట నష్టపోకుండా ఉండేలా పకడ్బందీ సౌకర్యాలు సమకూర్చాలన్నారు. షెడ్లకు సంబంధించిన ఐరన్ పిల్లర్లను నిలబెట్టే కార్యక్రమానికి మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులతో కలిసి శ్రీకారం చుట్టారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఈ మోడల్ వ్యవసాయ మార్కెట్ నిర్మాణం దేశంలో ఎక్కడా లేని విధంగా జరుగుతోందని, ఇతర రాష్ట్రాల రైతులు, మార్కెటింగ్ శాఖ అధికారులు ఇక్కడికి వచ్చి ఖమ్మం చూసి స్ఫూర్తిగా తీసుకునేలా ఉంటుందన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మాణ పనులు చేయాలని నిర్మాణసంస్థకు సూచించామన్నారు. బ్యాంకు ఏర్పాటుతో పాటు పంటలు వర్షాలకు తడవకుండా, అగ్నిప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకునేలా నిర్మాణం ఉండబోతోందన్నారు. అధునాతన సౌకర్యాలతో మార్కెట్ ఉంటే రైతులకు మంచి గిట్టుబాటు ధర వస్తుందని మంత్రి వివరించారు. వచ్చే సంక్రాంతి రోజునుంచి కొత్త వ్యవసాయమార్కెట్‌లో పంటల కొనుగోళ్లు గతం లోలా యథావిధిగా ఉంటాయన్నారు. అలాగే మార్కెట్ చుట్టూ రహదారులు వెడల్పుగా ఉండేందుకు ఆక్రమణదారులను తొలిగించి వారికి శాశ్వత నిర్మాణాలు చేపడతామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు మాట్లాడుతూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పాతభవనాలు సక్రమంగా లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులుపడే పరిస్థితి ఉందని, ఎన్నికల సమయంలో మంత్రి తుమ్మల ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా మోడల్ వ్యవసాయ మార్కెట్‌ను నిర్మిస్తున్నారని, తద్వారా ఖమ్మానికి మరింత గుర్తింపు రాబోతోందన్నారు. మేయర్ నీరజ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, ఈ మార్కెట్ ద్వారా రైతులకు అధునాతన సౌకర్యాలు అందుతాయన్నారు. ఖమ్మం ఆర్డీవో నరసింహారావు మాట్లాడుతూ మార్కెట్ రోడ్ల వెంట ఉన్న వారిని తొలిగించి వారికి శాశ్వత ఇంటి స్థలాలు , ఇల్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామని, ఇందుకు పదెకరాల వరకు అవసరం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ సంస్థ ప్రతినిధి ప్రవీణ్, రైతుసంఘంనాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తిలక్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా.. వెతలు

(5వ పేజీ తరువాయి)

అందుబాటులో ఉన్నా.. ధర అధికంగా ఉండడంతో.. సింగిల్ విండోలో తక్కువగా లభ్యం అవుతుండడంతో ఇక్కడ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాలో ఇది పరిస్థితి..

జిల్లాలో గురువారం రాత్రి వర్షం కురవడంతో రైతులు ఎరువులు దుకాణాలకు, సొసైటీ, ఆగ్రో సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఈ తరుణంలో కొందరు ప్రైవేట్ డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతుల అవసరాన్ని సొమ్ము లు చేసుకుంటున్నారు. వరి పంటలకు మెజార్టీ రైతులు డీఏపీ, యూరియా వినియోగిస్తున్నారు. మార్కెట్‌లో డీఏపీ బస్తా ధర రూ.1350 ఉండగా.. యూరియా రూ.266 ఉంది. కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తూ బస్తాకు రూ.50 నుంచి 250 వరకు పెంచి అక్రమంగా అధిక వసూళ్లకు తెరలేపారు. జింక్ లేదా ఇతర ఎరువులు కొనాలని లింకులు పెడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో వరి, పత్తి, మొక్కజొన్న, జొన్నలు, మిర్చి, కంది, పెసర, మినుములు, వేరుశనగలు వందల హెక్టార్లలో సాగు అవుతున్నాయి. ఇవి కాకుండా సుమారుగా 5 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేస్తున్నారు.

యూరియా కొరతను సొమ్ము చేసుకుంటున్న ప్రైవేట్ డీలర్లు..

వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 45 కిలోల యూరియా బస్తా ధర ఎమ్మార్పీ రూ.266.50. సొసైటీలు, ఆర్ఎస్‌కేల వద్ద ఇదే ధరకు అమ్ముతున్నారు. ప్రైవేట్ డీలర్లు మాత్రం రూ.300నుంచి రూ.350వరకు అమ్ముతున్నారు.

జిల్లాలో లింక్ ప్రాడక్ట్స్ ఎరువులు కొంటేనే యూరియా..!

జిల్లాలో భారత్ పేరుతో ఐపీఎల్, ఇఫ్కో, క్రిభ్కో, ఆర్పీఎఫ్ కంపెనీలకు చెందిన ప్రొడక్ట్‌లు అమ్ముతున్నారు. ప్రైవేట్ డీలర్లు తమ షాపులో 5 టన్నులు యూరియా కావాలంటే 10 టన్నులు 20-20, 316, బయో కంపెనీ న్యూట్రియన్స్ బ్యాగులు కొనాలని లింకు పెడుతున్నారు. జిల్లాలో సొసైటీల వద్ద యూరియా కొనాలంటే 20-20 బస్తా తీసుకుంటే 3 బస్తాలు యూరియా ఇస్తామని, లేకుంటే 1,2 బస్తాలు యూరియా ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు. జిల్లాలో సుమారుగా 600పైచిలుకు ఫెర్టిలైజర్ షాపులు ఉన్నాయి. గిరాకీని ఆసరాగా చేసుకుని యూరియా కావాలంటే మిశ్రమ ఎరువులు కొనుగోలు చేయాలని షరతు విధిస్తున్నారు. ఈ తంతు తెలిసినా వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

కొరవడిన పర్యవేక్షణ..

జిల్లాలో జూలై నెలలో 13,655 మె.టన్నులు అవసరం ఉంటుందని అంచనా.. సొసైటీలకు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు, ప్రైవేట్ డీలర్స్‌కు అధికారులు ఎరువులు కేటాయిస్తున్నారు. జిల్లాలో కొందరు సొసైటీల నిర్వాహకులు ప్రైవేట్ డీలర్లకు యూరియా అమ్ముకునేందుకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అశ్వాపురంలోని సొసైటీకి కేటాయించిన ఎరువులను జగ్గారంలో బినామీ ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాపునకు రాత్రి సమయాల్లో యూరియా తరలించి అమ్ముతున్నట్లు వినికిడి. ఎరువులు కేటాయించిన తరువాత షాపులను తనిఖీ చేసి రైతులకు పంటల సాగు విస్తీర్ణం, పంట పరిస్థితిని, భూమిలో తేమ స్థితిని పరిశీలించి సరఫరా అవసరం మేరకు ఇస్తున్నారా..? లేదా అని పర్యవేక్షించే నాథుడే కరువయ్యాడు. సొసైటీలకు కేటాయించిన యూరియా సక్రమంగా రైతులకు పంపిణీ అయ్యేలా చూసే పర్యవేక్షణ కొరవడింది.

అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

జిల్లాలో ఎక్కడ ఎరువుల కొరత లేదు. యూరియాను అధిక ధరలకు అమ్మినా.. లింక్ ప్రొడక్ట్‌తో కొనుగోలు చేయాలని షరతులు విధించినా కఠిన చర్యలు తీసుకుంటాం. నానో యూరియా ఎరువులను వాడాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో ప్రతి మూడు రోజులకు యూరియా వస్తుందని, నానో యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయన్నారు. అదేవిధంగా మున్ముందు యూరియా దొరుకుతుందో లేదోనని రైతులు ప్రస్తుత అవసరానికంటే అధికంగా కొనుగోలు చేస్తుండడం యూరియా కొరతకు కారణమవుతోంది.

'నానో'తో లింక్ పట్ల అసహనం

తీసుకొనేందుకు నిరాకరిస్తున్న రైతులు




యూరియా బస్తాలు

వేంసూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా బాటిల్ తీసుకుంటేనే యూరియాకు ఇస్తామంటూ డీలర్లు లింక్ పెడుతుండగా.. రైతులు వాటిని తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కొందరు నానోయూరియా బాటిల్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా తమకు భారంగా మారుతుందని రైతులు వాపోతున్నారు. యూరియా బస్తా రూ.266 ఉండగా నానోయూరియా బాటిల్ రూ.220 ఉంది. అవసరం లేకున్నా నానోయూరియా బాటిల్‌ను తీసుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీల్లో రైతుకు నాలుగు కట్టలు చొప్పున ఇస్తుండగా మన గ్రోమోర్‌లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల సమయం వరకే రైతుకు ఒక కట్ట మాత్రమే ఇస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్న రైతులకు వేంసూరు మండలంలో యూరియా కట్టకు నానోయూరియా లింక్ పెడుతుండటంతో గత్యంతరం లేక కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. నానోయూరియా ఒక బాటిల్ స్ప్రే చేయాలంటే సుమారు రూ.600వరకు ఖర్చుచేయాల్సి వస్తుందని రైతులు తెలుపుతున్నారు. సరిపడా యూరియా బస్తాలు ఇవ్వకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి యూరియాకు నానోయూరియా లింక్ పెట్టకుండా, సరిపడా యూరియా బస్తాలు సరఫరా చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

లింక్ పెట్టి ఇబ్బందులు పెట్టొద్దు

వెల్లంకి కేశవరావు రైతు, లింగపాలెం

యూరియాకు నానోయూరియాను అంట గట్టడం వల్ల తమకు అధిక వ్యయమవుతుంది. మా అవసరాలకు సరిపడా యూరియా కట్టలను సరఫరా చేయాలి. నానోయూరియా వాడకం వల్ల రూ.600కుపైగా ఖర్చు చేయాల్సి వస్తుంది. అధికారులు స్పందించి సొసైటీలు, మన గ్రోమోర్‌ల్లో యూరియాకు నానో యూరియాను అంటగట్టకుండా చర్యలు తీసుకోవాలి.



వెల్లంకి కేశవరావు, రైతు

25నుంచి రేషన్ కార్డుల పంపిణీ

- భారీ వర్షాలతో జరిగే ప్రమాదాలను నివారించాలి
- సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు సీఎం ఆదేశాలు




సీఎం వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీ నుంచి ఆగస్టు 10వతేదీ వరకు మండల కేంద్రాల్లో రేషన్ కార్డులను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లు, జిల్లాల అధికారులకు సూచించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ పలు అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు బోనకల్ రైతు వేదికనుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొనగా.. ఖమ్మం కలెక్టరేట్ నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గతేడాది ఖమ్మం జిల్లాలో మూడు గంటల వ్యవధిలో 39సెంటీమీటర్ల భారీ వర్షం పడిందని, ఈ ఏడాది కూడా అలాంటి భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ సాగు పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం, నీటి పారుదల శాఖ ద్వారా రైతులకు సాగునీరు విడుదల పై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. వర్షాకాలంలో వచ్చే అంటూ వ్యాధుల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ముఖ్యంగా ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో దృష్టి సారించాలన్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు అధికంగా నిర్వహించాలని, ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేసి పనితీరు పర్యవేక్షించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. బోనకల్ నుంచి వీసీలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ, ప్రకృతి కరుణించిందని, ఈ సీజన్‌లోనూ మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం నుంచి సరైన సహకారం లేదని, కావాల్సిన యూరియా సరఫరా కాలేదన్నారు. ఇప్పటికే 50 శాతం నాట్లు పడ్డాయని, వచ్చే నెలలో కేంద్రం నుంచి యూరియా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్క్‌ఫెడ్ నుంచి డీలర్లకు, డీలర్ల నుంచి రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మాట్లాడుతూ భారీ వర్షాలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

భాష.. ప్రాణవాయువు లాంటిది

- మీరు మాట్లాడండి.. పిల్లలకు నేర్పండి
- కోయభాషలో ముద్రించిన పెండ్లి పత్రికను ఆవిష్కరించిన పీవో
- ఆదివాసీలకు శుభాకాంక్షలు తెలుపుతూ వీడియో సందేశం



పెండ్లి పత్రికను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భాష ప్రాణవాయువు లాంటిది...మీ భాషలో మాట్లాడండి...పిల్లలకు నేర్పండని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదివాసీలకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ కోయభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసీలకు కోయభాషలోనే శుభాకాంక్షలు తెలుపుతూ ఒక వీడియో సందేశాన్ని సోమవారం విడుదల చేశారు. ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు గొప్పవని అన్నారు. ఆదివాసీల సంస్కృతి, పండుగలు విడివిడి పూలైతే దండలా చేసే దారమే భాష అని పేర్కొన్నారు. భాష ఎంతో కీలకమన్నారు. ఐటీడీఏ పరంగా వీలైన సందార్భల్లో కోయభాషను తాము ప్రోత్సహిస్తున్నామని, ఈ క్రమంలో ఉద్యోగులను ప్రశంసిస్తూ ఇచ్చే పత్రాలను, అలాగే ఆహ్వాన పత్రికలను కోయభాషలో ముద్రించడం జరుగుతోందన్నారు. అలాగే ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియాన్ని మరింతగా అబివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు.

భద్రాచలానికి చెందిన ఉపాధ్యాయురాలు పూనె లక్ష్మి శరణ్య, పాల్వంచకు చెందిన కన్నరాజుల వివాహం ఆగస్టు 3న జరగనుండగా తమ పెండ్లి పత్రికను కోయభాషలో ముద్రించాలని నిర్ణయించుకున్నారు.పెండ్లి పత్రికను కోయభాషలో ముద్రించగా తొలి పత్రికను ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి ఆవిష్కరింపజేశారు. కాగా వారు తమ పెండ్లి పత్రికలో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ ఐఏఎస్ గారి ప్రేరణతో కోయభాషలో పెండ్లి శుభలేఖ అని ముద్రించారు. ఈ సందర్భంగా పీవో వారి తో మాట్లాడుతూ కోయభాష దినోత్సవం రోజున ఈ విధంగా పెండ్లి పత్రికను ఆవిష్కరించడం తనకెంతో ఆనందంగా ఉందని అన్నారు. కోయభాష అభివృద్ధికి తాను చేస్తున్న ప్రయత్నానికి ఈవిధంగా కాబోయే నూతన దంపతులు తమ మాతృభాషలో పెండ్లి పత్రికను ముద్రించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.

ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రస్తావించిన పీవో

ప్రపంచ కోయభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని భాషకు బాసటగా నిలిచే వారేరీ?అమ్మభాషకు దూరవవుతున్న ఆదివాసీలు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనాన్ని సైతం పీవో రాహుల్ ప్రస్తావించారు. భాషాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఇంట్లో ప్రతి ఒక్కరు కోయభాషను మాట్లాడి తమ పిల్లలకు వచ్చేలా నేర్పాలని సూచించారు.

కాంట్రాక్ట్ వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

● డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు

చుంచుపల్లి, జూలై21(ఆంధ్రజ్యోతి): భద్రాద్రిలో మూడు కాంట్రాక్ట్ వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులైన చర్ల, పాల్వంచ, అశ్వారావుపేటలో ప్రసూతి, మత్తు వైద్యుల పోస్టుల భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అశ్వారావుపేట ఆసుపత్రిలో మత్తు వైద్యుడి ఒక పోస్టు, జీతభత్యం రూ.1.50 లక్షలు, పాల్వంచలో ప్రసూతి వైద్యురాలు ఒక పోస్ట్, జీతభత్యం రూ.1.50 లక్షలు చర్లలో ప్రసూతి వైద్యురాలు - ఒక పోస్ట్, జీతభత్యం రూ.2.50 లక్షలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు భద్రాద్రి జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీవోసీలో ఎస్-26లో గల డీసీహెచ్ఎస్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

హైవేల్లోని విద్యుత్ లైన్లను త్వరగా మార్చండి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జూలై21(ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో నేషనల్ హైవే రహదారుల నిర్మాణ ప్రాంతంలో విద్యుత్ లైన్లను సత్వరం మార్చుచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే కొదుమూరు గ్రామం వద్ద ఉన్న హైటెన్షన్ లైన్‌ను తక్షణం మార్చేలా చూడాలని ట్రాన్స్‌కో డైరెక్టర్ లతా వినోద్‌కు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకానికి ఈనెల 24న ట్రయల్‌రన్ నిర్వహించాలని కోరారు తద్వారా చెరువులకు నీరు నింపాలని సూచించారు. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఎస్పీడీసీఎల్ సీఎండీతో మాట్లాడి టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో నేషనల్ హైవే ట్రాన్స్‌కో అధికారులు సమన్వయంగా విద్యుత్ తీగలు తొలిగించాలని తెలిపారు వెలుగుమట్ల అర్బన్‌పార్కులో వన్యప్రాణులు తాగేందుకు నీరు, నర్సరీలకు నీటి సరఫరా నిమిత్తం కొదుమూరు లిఫ్టు ఇరిగేషన్ నుంచి వెలుగుమట్ల అర్బన్‌పార్కు వరకు పైపులైన్లు వేయాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు ఖమ్మం అటవీశాఖ అధికారులతో సమన్వయంచేసుకోవాలని కోరారు. ఖమ్మం నగర సుందీరకరణకు రహదారులు విస్తరింపచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు మార్కెట్ యార్డు చుట్టూర రహదారుల విస్తరణ కోసం ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు . ఖమ్మం మాస్టర్‌ప్లాన్ సత్వరం ఆమోదం పొందేలా చూడాలని తెలిపారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అధికారులు పాల్గొన్నారు.

కరాటే మాస్టర్ హుస్సేన్‌కు నేషనల్ ఎక్సలెన్సీ అవార్డు



సినీనటుడు భానుచందర్ నుంచి అవార్డును అందుకుంటున్న కాశీహుస్సేన్

చుంచుపల్లి, జూలై21(ఆంధ్రజ్యోతి): కుంగ్‌ఫూ, కరాటే సీనియర్ మాస్టర్, చుంచుపల్లి మండల వాసి పెదపాటి కాశీ హుస్సేన్‌కు నేషనల్ స్టార్ ఎక్సలెన్సీ అవార్డును విజయవాడలో సినీ నటుడు భానుచందర్ సోమవారం ప్రదానం చేశారు. మార్షల్ ఆర్ట్స్‌లో గత 35 సంవత్సరాల నుంచి కుంగ్ ఫూ, కరాటే విద్యార్థిగా, క్రీడాకారుడిగా, అనేక జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో ప్రాతినిధ్యం వహించి అనేక పతకాలు, బహుమతులు, వివిధ అవార్డులు గెలుపొందాడు. ఇప్పటి వరకు సుమారుగా ఐదు వేల మందికి ఉచితంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ కొనసాగిస్తున్నారు. ఆయన మార్షల్ ఆర్ట్స్‌లో అందించిన సేవలను గుర్తించిన వైఎంకె మార్షల్ ఆర్ట్స్ అకాడమీ దేశంలో ప్రతిభావంతులైన విశిష్ట సేవలు అందించిన 50 మంది మాస్టర్లను ఎంపిక చేయగా అందులో కాశీ హుస్సేన్‌కు స్థానం దక్కడం విశేషం. అవార్డు గ్రహిత కాశీ విషయాలకు భద్రాద్రి జిల్లా వివిధ క్రీడా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీనియర్ క్రీడాకారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉమ్మడి జిల్లా బీఎస్ఎన్ఎల్ ఎంప్యానల్‌మెంట్ న్యాయవాదిగా బాబురావు



న్యాయవాది బాబురావుకు నియామకపత్రం అందజేస్తున్న ఎంజీఎం సుభాష్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఎస్ఎన్ఎల్ ఎంప్యానల్‌మెంట్ న్యాయవాదిగా కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ఏపూరి బాబురావు సోమవారం నియమితులయ్యారు. భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) చీఫ్ జనరల్ మేనేజర్ తెలంగాణ సర్కిల్ వారు ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నందు న్యాయ సేవలు అందించే నిమిత్తం సీనియర్ న్యాయవాది బాబురావు ను నియమించారు. నల్గొండ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వెంకటేశం ఆదేశాల మేరకు భద్రాద్రి జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) సుభాష్, న్యాయవాది బాబురావు మర్యాద పూర్వకంగా కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఇంజనీర్ సక్రు, జూనియర్ టెలికాం ఆఫీసర్ సందీప్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు శివరాంజి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వాన

- పంటలకు ఊపిరి పోసిన వర్షం
- ఖమ్మంలో రోడ్లపైకి పొంగిపొర్లిన నీరు
- మధిర మల్లారంలో పాడిగేదెలు గల్లంతు
- భద్రాద్రి జిల్లాలో ఉరుములు,మెరుపులు
- పిడుగుపాటుకు పినపాకలో మహిళ మృతి




సుజాతనగర్‌లో మృత్యువాతపడిన మేకలను పరిశీలిస్తున్న నాయకులు, పాల్వంచ కిన్నెరసాని ప్రాజెక్టులో 399.40 అడుగులకు చేరిన నీరు

ఖమ్మం/కొత్త గూడెం,జూలై21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం వర్షం విస్తారంగా పడింది. దీంతో కొద్దిరోజులుగా వర్షాభావ పరిస్థితులతో ఆందోళన చెందుతున్న రైతులు ఊపిరిపీల్చుకున్నారు. పత్తి, వరి పంటలకు ఊపిరిపోసింది. అయితే గతనెల వ్యవధిలో పడని విధంగా పలు మండలాల్లో సోమవారం మోస్తరు వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పడిన వానకు ఖమ్మంనగరంలో రోడ్లు పొంగిపొర్లాయి. పలు మండలాల్లో వాగులు, కుంటల్లోకి వరద నీరుచేరింది. మధిర మండలం మల్లారంలో నల్ల వాగు పొంగడంతో ఆరు పాడి గేదెలు గల్లంతయ్యాయి. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా చింతకానిలో 6.2సెంమీ వర్షపాతం నమోదైంది. మధిరలో5, ఖమ్మం అర్బన్‌లో ఖానాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 4.8, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 4.7, బోనకల్లు మండలం రావినూతలలో, ముదిగొండలో 4.5, పమ్మిలో 4.1, చింతకాని మండలం నాగులవంచలో 3.68, పెనుబల్లిలో 3.5, వెంకటాయపాలెం ఐడీవోసీ, ఖమ్మం అర్బన్ ఎన్నెస్పీ గెస్ట్ హౌజ్ పరిధిలో 3.3 సెంమీ వర్షపాతం నమోదైంది. సత్తుపల్లిలో 2.9,వేంసూరులో2.5, ఏన్కూరులో2.35,నేలకొండపల్లిలో2.23, బాణాపురంలో2.18సెంమీ వర్షపాతం నమోదు కాగా.. కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడులో 4.53 సెంమీ వర్షపాతం నమోదుకాగా,మణుగూరులో 3.53, చంద్రుగొండ మండలం మద్దుకూరులో 3.1, లక్ష్మీదేవిపల్లిలో2.7, ముల్కలపల్లిలో 2.33, గుండాలలో 2 సెంమీ, ఇల్లెందులో 1.93, దమ్మపేటలో 1.85, జూలూరుపాడులో 1.83, సుజాతనగర్‌లో 1.6 సెంమీ వర్షపాతం నమోదైంది.

13మేకలు మృత్యువాత

సుజాతనగర్: సుజాతనగర్‌కు చెందిన కేసుపాక పుల్లయ్య మేకలను సమీపంలోని జామాయిల్‌తోటకు మేతకు తీసుకెళ్లగా వర్షం రావడంతో అవి చెట్టుకిందరకు వెళ్లాయి. అదే సమయంలో పిడుగుపడటంతో 13 మేకలు మృత్యువాతపడ్డాయి. మేకలవిలువ సుమారు రూ.2లక్షలకుపైగా ఉంటుందని యజమాని కన్నీరుమున్నీరయ్యారు. మృతి చెందిన మేకలను వైద్యాధికారులు పరిశీలించి నమోదు చేసుకున్నారు. మేకల యజమానిని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి కుమార హనుమంతరావు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్ తదితరులు ఓదార్చారు.

నల్లవాగు ఉధృతికి ఆరు పాడిగేదెల గల్లంతు

మధిరరూరల్: నల్లవాగు వరద ఉధృతికి ఆరు పాడిగేదెలు గల్లంతయ్యాయి. సోమవారం సాయంత్రం మధిర మండలం మల్లారంలో జరిగింది. గ్రామంలో నలమల రామకృష్ణ, మందడపు తేజ, వనమా రామకృష్ణకు చెందిన ఆరుపాడిగేదెలు పొలంలో మేత మేసేందుకు మల్లారం-రొంపిమళ్ల సమీపంలోని నల్లవాగు పరిసర ప్రాంతంలోకి వెళ్లాయి. రెండురోజులుగా పడుతున్న వర్షాలకు నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో మేతకు వెళ్లిన గేదెలు నల్లవాగులో గల్లంతయ్యాయి. ఒక్కో పాడిగేదె విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు.

కిన్నెరసాని జలాశయంలో పెరిగిన నీటిమట్టం

పాల్వంచ రూరల్: ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు చేరడంతో సోమవారం పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయం నీటిమట్టం పెరిగింది. ఎగువ ప్రాంతాలైన పాకాల కొత్తగూడ, గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం నుంచి వరదనీరు చేరుతుంది.ఇన్‌ఫ్లో 1500క్యూసెక్కుల చొప్పున వస్తుండగా.. జలాశయ సామర్థ్యం 407 అడుగులు కాగా 399.40అడుగులకు చేరడంతో డ్యాం అధికారులు అప్రమత్తమయ్యారు.

నాటు వేస్తుండగా పిడుగుపాటు.. మహిళ మృతి

పినపాక: వరినాటు వేస్తున్న సమయంలో పిడుగుపడి ఓమహిళ మృతిచెందిన సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా పినపాక మండలం బోటిగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో సోమవారం వరి నాటు వేస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడగా.. కూలీలంతా పొలం నుంచి బయటకు వెళ్తుండగానే పిడుగు పడింది. దీంతో కొమరం రమణ (55) కుప్పకూలింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలవగా ఆ ముగ్గురిని పినపాక ప్రభుత్వాసుపత్రికి తరలించేలోపు రమణ మృతి చెందింది. మృతురాలు రమణకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉండగా.. భర్త గతంలోనే చనిపోయాడు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జూలూరు పాడు,జూలై 21(ఆంధ్ర జ్యోతి): పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈసంఘటనమండలంలోని గుండ్లరేవు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గుండ్లరేవు గ్రామానికి చెందిన తుశ్లారు నరసింహారావు(47) ఆదివారం రాత్రి తన కుటుంబసభ్యులతో కలసి నిద్రకు ఉపక్రమించారు. కుటుంబసభ్యులు లేవకముందే తెల్లవారుజామున పొలానికి వెళ్లారు. అక్కడ పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం నిద్రలేచిన కుటుంబసభ్యులు నరసింహారవు ఇంట్లో కనిపించకపోటంతో గుర్రై వెతుకుతూ పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే ఆయన అపస్మారకస్థితిలో ఉన్నాడు. కుటుంబసభ్యులు 108లో జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సను అందించేందకు జూలూరుపాడులోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. నరసింహారావు మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య వాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహిళ అస్థిపంజరం లభ్యం



పెనుబల్లి,జూలై 21(ఆంధ్రజ్యోతి): ఓ గుర్తుతెలియని మహిళ అస్థిపంజరం లభ్యమైంది. ఈ సంఘటన పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి సమీపంలోని కుక్కల గుట్ట వద్ద సోమవారం జరిగింది.పోలీసులు తెలిపిన ప్రకారం... మండలంలోని కొత్తలంకపల్లి గ్రామపరిధిలో కుక్కలగుట్టపై మహిళ అస్థిపంజరం ఉన్నట్లు పశువుల కాపర్లు గుర్తించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి యలమద్ది మల్లికార్జున్‌రావు కుక్కలగుట్టపై 20నుంచి 30సంవత్సరాల వయస్సున్న మహిళ అస్థిపంజరం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.వీఎంబంజర్ పోలీసులు అక్కడకు చేరుకుని అస్థిపంజరాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సెల్ ఫోన్ అప్పగింత

భద్రాచలం, జూలై21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం-చర్ల బస్సులో ఓ మహిళ ప్రయాణికురాలు ఫోన్‌ను పొగొట్టుకున్నారు. డ్యూటీలో ఉన్న కండక్టర్ కృష్ణవేణికి దొరకకగా ఆ ఫోన్‌ను డిపోలో అందజేశారు. దీంతో భద్రాచలం డీఎం అల్లం నాగేశ్వరరావు సోమవారం బాధితురాలు కృష్ణవేణికి ఫోన్ చేసి ఫోన్‌ను అప్పగించారు. కండక్టర్‌ను అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

పెనుబల్లి,జూలై21(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పెనుబల్లి మండలం గుట్టపాడులో సోమవారం చోటుచేసుకుంది. కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన గొల్లమందల జయమణి(22)భర్త వంశీతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో మనస్తాపం చెంది గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై వీధి కుక్కల దాడి

భద్రాచలం, జూలై 21(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని అశోకనగర్ కాలనీలో సోమవారం 8వతరగతి చదువుతున్న విద్యార్థినిపై వీధికుక్కలు దాడి చేశాయి. స్కూలు బ్యాగుతో వెళుతుండగా ఒక్కసారిగా కుక్కలు దాడి చేయగా గమనించిన స్థానికులు పాపను ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. స్వల్ప గాయాలు కాగా, వైద్యం అందించారు. బ్రిడ్జిసెంటర్‌లోని బాలిక, రెవెన్యూ కాలనీలో మరొకరిపై దాడి చేశాయి.

వ్యక్తి మృతి అనుమానాస్పదం

పినపాక,జూలై21(ఆంధ్రజ్యోతి):మండలంలోని తోగ్గూడెంగ్రామానికి చెందిన ఇర్పా నరేష్(38) అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇర్పా నరేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ, భార్య పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. 10రోజుల క్రితం గ్రామంలో ఓ వ్యక్తి చనిపోయాడు. ఈక్రమంలో అతిగా మద్యం తాగాడు. ఎప్పటిలాగే తిరిగి ఇంటికి వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. ఆయనకోసం ఎదురు చూస్తున్నారు. చనిపోయిన వ్యక్తి ఖర్మకాండల సందర్భంగా ఆ దారి వెంట వెళ్తున్న వారికి పాడుబడి ఉన్న ఇంటిలో నుంచి దుర్వాసన వస్తుండడటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య శైలజ, బంధువులు అక్కడకు వెళ్లారు. మృతుడు ఇర్పా నరేష్‌ను గుర్తించారు. మృతుడి కుమార్తె లక్ష్మీ 9వతరగతి, అబ్బాయి పందు మూడోతరగతి చదువుతున్నారు.భార్య శైలజ ఫిర్యాదు మేరకు ఏడూళ్ల బయ్యారం పోలీసులు కేసు నమోదు చేశారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కూసుమంచి, జూలై 21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.23లక్షల విలువైన 77 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం గుర్వాయిగూడెం గ్రామంలో మృతిచెందిన మాజీసర్పంచి సారబుడ్ల నారాయణరెడ్డి మృతదేహాన్ని సందర్శించారు. నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జైళ్లశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం

ఖమ్మంక్రైమ్, జూలై21(ఆంధ్రజ్యోతి): జైళ్ల, ఫారెస్ట్ శాఖల ఆధ్వర్యంలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్‌ఖమ్మంలో మెక్కలు నాటి, 14వేల సీడ్ బాల్ (విత్తన బంతులను) తయారు చేశామని జిల్లా కారాగారం పర్యవేక్షణ అధికారి ఏ. శ్రీధర్ తెలిపారు. సంరక్షణ అవసరం లేని ప్రకృతి సిద్ధంగా త్వరగా పెరిగే చెట్ల రకాలైన చింత, వేప, కానుగ, రెల్ల, కుంకుడు, మొదలైన చెట్ల నుంచి విత్తనాలను సేకరించామన్నారు. జల్లెడ పట్టిన ఎర్రమట్టిని 75 శాతం కలిపి 25 శాతం ఆవుపేడ, కోకాపిట్ కలిపి ముద్దలుగా తయారు చేశామన్నారు. ఈ మట్టి ముద్దల్లో ఖైదీలు విత్తనాలు పెట్టి వీటిని ఎండబెట్టడం జరిగిందన్నారు. ఈ ముద్దలను సోమవారం జిల్లా కర్మాగారం, ఫారెస్టు డివిజన్ ఖమ్మం సిబ్బంది 80 మంది సిబ్బందితో కలిసి వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో విసరడం జరిగిందని తెలిపారు. అనంతరం వివిధ రకాలు మెక్కలను


మెక్కనాటి నీళ్లు పోస్తున్న అధికారులు

నాటారు. ఈకార్యక్రమంలో ఫారెస్ట్ డివిజన్ అధికారి కె.వెంకన్న, జైలర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ జైలర్ ఏ. సుభాష్, కె.హనుమంతరావు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

» ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పరంజ్యోతి

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.పరంజ్యోతి తెలిపారు. హిస్టరీ 1, పొలిటికల్ సైన్స్ 1, కామర్స్ 2, కెమిస్ట్రీ 1, బోటనీ 1, తెలుగు 1, ఆంగ్లం 1, కంప్యూటర్ సైన్స్ 1, గణాతం 1 పోస్టు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు బుధవారంలోగా దరఖాస్తులను కళాశాలలో అందించాలని తెలిపారు. పీజీలో కనీసం 55శాతం(ఎస్టీ,ఎస్సీ అభ్యర్థులకు 50 శాతం), మార్కులు ఉండాలన్నారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. బోధన అనుభవం కలిగినవారు సర్వీస్ సర్టిఫికెట్ జతచేయాలని తెలిపారు.

అరగంట వర్షానికే అతలాకుతలం

» వైరా రోడ్డులో వరద ప్రవాహం
» నిలిచిన ట్రాఫిక్
» సైలెన్సర్‌లోకి నీళ్లుపోయి మరమ్మతులకు గురైన వాహనాలు
» ప్రధాన రహదారి డ్రెయినేజీలో పూడిక తీయకపోవటమే లోపం

ఖమ్మంకార్పొరేషన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అరగంట వర్షానికే నగరంలోని వైరారోడ్డు ప్రధాన రహదారిలో వరద పోటెత్తింది. ఫలితంగా వాహనదారులు తీవ్రఇబ్బందిపడ్డారు. సోమవారం ఉదయం 12గంటల సమయంలో 30నిమిషాలు పాటు వర్షం పడింది. ఇంకేముంది ఇల్లెందుక్రాస్‌రోడ్డు నుంచిపాత బస్టాండ్ వరకు ప్రధాన రహదారిపై ఇరువైపులా రహదారిపైకి వరద నీరు చేరింది. ట్రాఫిక్ నిలిచిపోయింది. డ్రెయినేజీల్లో పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు నిల్వలు ఉండిపోవటంతో వరద నీరు ప్రధాన రహదారిపైకి వచ్చింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాల్లోని సైలెన్సర్‌లోకి నీరు పోవటంతో తీవ్రఇబ్బంది పడ్డారు. డ్రెయినేజీల సిల్ట్ క్లీనింగ్‌లోపం బయటపడింది. వందరోజుల ప్రత్యేక కార్యక్రమంలో గ్యాంగ్ వర్క్ చేసిన అధికారులు వైరారోడ్డుపై దృష్టి సారించలేదని విమర్శలు వెలువడ్డాయి. భారీ వర్షాలు పడకముందే వైరా రోడ్డులోని సైడ్ డ్రెయినేజీల్లోని సిల్ట్‌ను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగర ప్రజలు కోరారు.


టీటీడీసీ ఎదుట రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు


వైరా రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

గతేడాది శుభ్రంగా

గత సంవత్సరం సెప్టెంబరు 1న కురిసిన భారీవర్షాలకు మున్నేరు పరివాహకం ప్రాంతంతో పాటుగా 10, 11మరికొన్ని డివిజన్లు ముంపునకు గురయ్యాయి. ఖమ్మం వైరా ప్రధాన రహదారిపై వరద నీరు కొద్ది సమయంలోనే సాధారణ పరిస్థితిలోకి వచ్చాయి. వాహనదారులకు పెద్దగా ఇబ్బంది పడలేదు. ఎందుకంటే వర్షాకాలానికి ముందే అనాటి అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ వైరా రోడ్డులోని ఐటీ హబ్, పాతఎల్ఐసీసెంటర్, బాబురావు పెట్రోల్ బంక్, మయూరిసెంటర్, రైల్వేవంతెన భాగంలో ఉన్న డ్రెయినేజీలో వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. వరదనీరు సజావుగా వెళ్లేందుకు డ్రెయినేజీలోని సిల్ట్ క్లీయర్ చేశారు. దీంతో ఇల్లెందు క్రాస్ రోడ్డు, వైరా రోడ్డు, మయూరిసెంటర్ వరకు వచ్చిన వరద నీరు గోళ్లపాడు ఛానల్ ద్వారా మున్నేరులో కలిసి పోయింది.

ఆనందంలో అన్నదాతలు

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. పత్తి, పెసర పంటలు సాగుచేశారు. వరుణుడు మొఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందారు. సోమవారం కురిసిన భారీ వర్షంతో పంటలకు మంచి మేలు జరిగింది. మరో మూడురోజులపాటు భారీవర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండేవారితో పాటు చెరువులు, కుంటల సమీపంలో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు.


తిరుమలాయపాలెంలో వర్షం

ఘనంగా ఆషాఢ బోనాలు



మారెమ్మ ఆలయంలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు, బోనమెత్తిన భక్తులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆషాఢ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ముత్యాలమ్మ, మైసమ్మ, మద్దిరావమ్మ, పెద్దమ్మతల్లి, మారెమ్మతల్లి ఆలయాల్లో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయంలో, రెడ్డిపల్లి మారెమ్మ తల్లి ఆలయంలో భక్తులు బోనాలు సమర్పించారు. ఆఖరి వారం కావాటంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేకంగా క్యూలైన్‌లను ఏర్పాటు చేసి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. రెడ్డిపల్లి మారెమ్మ తల్లి ఆలయంలో ఆలయ అర్చకులు రామశర్మ, ఆలయ కార్యనిర్వాహణ అధికారి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో బోనాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా పూజలు, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

గోరింటాకు వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి: ఆషాఢ మాసంలో మహిళలు ఎంతో ఇష్టంగా చేతులకు గోరింటా పెట్టుకుంటారు.ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయం. చిన్నా, పెద్ద తేడా లేకుండా మహిళలు, బాలికలు, కొందరు పురుషులు చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు సోమవారం నగరంలోని పలు ప్రాంతాలలో మహిళలు గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని టీఎన్‌జీఓ ఫంక్షన్‌హాల్‌లో మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



విద్యారంగ సమస్యలపై దశలవారీ పోరాటం

» యూఎస్‌పీసీ

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై దశలవారి పోరాటం నిర్వహిస్తామని యూఎస్‌పీసీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో యూఎస్‌పీసీ నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై మండల, జిల్లా కేంద్రాలతోపాటు, హైద్రాబాద్‌లో ధర్న కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడిచినప్పటికీ సమస్యలను పరిష్కరించటంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మ, పారుపల్లి . నాగేశ్వరరావు, వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు

నీటి హక్కుల కోసం జంగ్ సైరన్ మోగిద్దాం

ఖమ్మంస్పోర్ట్స్, జూలై21(ఆంధ్రజ్యోతి) ఏపీ ప్రభుత్వం తెలంగాణలో చేసే జల దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర నీటిహక్కుల కోసం జంగ్ సైరన్ మోగిద్దామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు అవలవభించాల్సిన విధానాలతో రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా ఇన్‌చార్జ్ లింగనబోయిన సతీష్, పరిశీలకులు రవినాయక్, షారూఖ్, మునాఫ్, గోపి, అఖిల్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఫుట్‌బాల్ సంఘంసెక్రెటరీ పదవికి ఆదర్శ్ రాజీనామా

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 21(ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ సంఘానికి రాజీనామా చేస్తున్నట్లు సంఘం కార్యదర్శి కల్యాణపు ఆదర్శ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి సహకారం అందించానని, ఇక నుంచి సంఘానికి చేసిన సేవలకు నేటితో ముగింపు పలుకుతున్నాని చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం మార్కెట్, జూలై21:(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలో జరిగిన కార్యకర్తల కార్యశాలలో మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకొని క్షేత్రస్థాయిలో కృషి చేయాలని అన్నారు. ప్రతీగ్రామంలో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తారని ఈసారి 'ఓటుతో గ్రామాన్ని గెలిపించాలి...దేశాన్ని ముందుకు నడిపించాలని' అనేనినాదంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గెంటేల విద్యాసాగర్, సన్నె ఉదయ్‌ప్రతాప్, దేవకి వాసుదేవరావు, ఇవి.రమేష్, దొంగల సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నున్నా రవి ఉన్నారు.

పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలి

» టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పారావు

కామేపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతమైన కామేపల్లిలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని టీడీపీ లీగల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొత్తలింగాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కారేపల్లి, ఏన్కూర్ రెండు మండలాల మధ్య ఉన్న కామేపల్లి పారిశ్రామిక పార్కుకు అనువైనదని అన్నారు. కామేపల్లిలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు అయ్యేవరకు తెలుగుదేశం పార్టీ పోరాటం ఆగదన్నారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ రాష్ట్రకార్యదర్శి చుండూరు రాజరాజేశ్వరి, టీడీపీ మండల అధ్యక్షుడు పుచ్చకాయల సత్యనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ తుమ్మలపల్లి పెద్దవీరయ్య, పుచ్చకాయల రామక్రిష్ణ, పాలడుగు కృష్ణ, బొయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


కొత్తలింగాలలో మాట్లాడుతున్న అప్పారావు

న్యాయవాద బిల్లుపై తక్షణ మార్పులు కోరుతూ వినతి పత్రం

ఖమ్మంలీగల్,జూలై21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యులు, ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి దిలీప్‌చౌదరి, పసుపులేటి శ్రీనివాస్ సోమవారం ఢిల్లీలో న్యాయశాఖ అదనపు కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్ మరియు న్యాయవాదుల అమెండ్‌మెంట్ బిల్లు-2025పై ఈ వినతి పత్రం సమర్పించారు. న్యాయ లక్ష్యంతో విచారణాధికారుల అనుమతితో తక్షణ పోలీస్ చర్యకు అవకాశం ఇవ్వాలని కోరారు. తెలంగాణలో సెంట్రల్ నోటరీ నియామకాల్లో జాప్యం జరుగుతుందని, 2021 నుంచి 19వందలకు పైగా న్యాయవాదులు ఇంటర్వ్యూకు ఎదురు చూస్తున్నారని తెలిపారు. వెంటనే జిల్లాల వారీగా పోస్టులు ప్రకటించి ఇంటర్వ్యూలు చేపట్టాలంటూ విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల సంక్షేమానికి గట్టి చట్టాలు అవసరముందని, జాతీయ అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్, ఆరోగ్య బీమా, పించన్ స్కీమ్,అత్యవసర సహాయం, చాంబర్లు మరియు లైబ్రరీలు వంటి వసతులు కల్పించాలని కోరారు. బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్, బీఎస్ఏ చట్టాల్లో సవరణలు తప్పనిసరి అని తాళ్లూరి దిలీప్‌చౌదరి పేర్కొన్నారు. న్యాయశాఖ అదనపు లాసెక్రెటరీ రామిశెట్టి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించి న్యాయశాఖమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తదుపరి సవరణల గురించి అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు.


రామిశెట్టి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందేస్తున్న దిలీప్‌చౌదరి, శ్రీనివాస్

పొలం పంపకాల్లో సోదరుల మధ్య వివాదం

» పత్తి పంటను ధ్వంసం చేయడంతో కేసు నమోదు

బోనకల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో అన్నదమ్ముల నడుమ పొలం పంపకాల్లో తలెత్తిన వివాదం చినికి చినికి గాలి వానలా మారింది. చివరకు సాగు చేసిన పత్తి పంటను సోమవారం ధ్వంసం చేయడంతో బాధిత రైతు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ పొదిలి వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ పత్తి పంటను సాగు చేశాడు. అతడి తమ్ముడు జాన్‌మీయాతో పొలం పంపకాల విషయంలో వివాదం నెలకొంది. పోలీస్ స్టేషన్లో పరస్పర ఫిర్యాదులు చేసుకోవడం, ఆ తరువాత పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుని రాజీ పడటం జరిగింది. కాని పొలాల రిజిస్ట్రేషన్ విషయంలో జాప్యం జరుగుతుండటంతో సహనం కోల్పోయిన జాన్‌మీయా అన్న సాగు చేసిన పత్తి పొలంలో మొక్కలను పీకేశాడు. దాదాపు 20 కుంటల భూమిలో పూత, కాపు దశలో ఉన్న పంట ధ్వంసం చేశాడని బాధిత రైతు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

» రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఈవీ రమేష్

తల్లాడ, జూలై21(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఈవీ రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కలిపించి పార్టీ వైపు ప్రజలను ఆకర్షించేలా చూడాలని కోరారు. ఈకార్యక్రమంలో గాదె కృష్ణారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు చల్లా నాగులు, రాయల రమేష్, కిరణ్, సాయిచంద్, వెంకటేశ్వర్లు, నరేష్, బస్వి రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ముదిగొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సుతారీ మేస్త్రీకి తీవ్రగాయాలైన సంఘటన ముదిగొండ మండలం బాణాపురం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. బాణాపురం గ్రామానికి చెందిన శీలం ఉపేందర్‌రావు నేలకొండపల్లి మండలంలో సుతారీ పని కోసం ద్విచక్రవాహనంపై వెళ్లి మధ్యాహ్నబోజనం కోసం తిరిగి ఇంటికి వస్తుండగా బాణాపురంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఖమ్మం నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఉపేందర్‌రావును చికిత్స నిమిత్తం ఖమ్మం ప్ర భుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవే ట్ హాస్పిటల్‌కు తరలించారు. భార్య లక్ష్మీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబసభ్యులు, బంధువుల ఆందోళన

రోడ్డు ప్రమాదంలో ఉపేందర్‌కు తీవ్రగాయాలు కావడంతో న్యాయం చేయాలంటూ అతడి కుటుంబసభ్యులు సోమవారం ముదిగొండ-వల్లభి రహదారిపై ఆందోళన నిర్వహించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

గోల్డ్‌మెడల్ సాధించిన ఫొటోగ్రాఫర్



పెనుబల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదోవ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫొటోగ్రఫీ పోటీల్లో పెనుబల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ కొప్పుల గోపాలరావు గోల్డ్‌మెడల్ సాధించారు. కారాయిగూడెం గ్రామానికి చెందిన కొప్పుల గోపాలరావు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించిన అవార్డుల్లో కలర్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ఏపీలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మత్స్యకారుల జీవనశైలి, జీవనాధారంపై తాను తీసిన ఫొటోకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫొటోగ్రఫీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోపాలరావును ఫొటో అండ్ వీడియో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల నర్సింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సతీష్, మధు, భద్రం, కృష్ణచైతన్య అభినందించారు.



శ్రుతిమించిన పుట్టినరోజు వేడుకలు

పదిమంది ఆకతాయిలపై కేసు నమోదు

సత్తుపల్లిరూరల్, జూలై21 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజు పార్టీ నేపథ్యంలో న్యూసెన్స్ చేసిన 10మంది వ్యక్తులపై సత్తుపల్లి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ టి.శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి మండలంలోని రుద్రాక్షపల్లిలో గ్రామానికి చెందిన దాసరి శ్రీధర్‌రెడ్డి తన పుట్టినరోజు పార్టీకోసం కొంతమందితో కలిసి మద్యం సేవించి అసభ్యకరమైన పాటలు పెట్టుకుని రోడ్డుపై డాన్స్‌వేస్తూ న్యూసెన్స్ చేశారు. చుట్టుపక్కల వారితో పాటు బత్తుల భరత్‌కుమార్ ఇదేమిటని ప్రశ్నించగా నానా దుర్భషలాడుతూ చంపుతామని బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాసరి శ్రీధర్‌రెడ్డి, దాసరి ప్రదీప్‌రెడ్డి, షేక్ జానీ, షేక్ అలీ, షేక్ జాన్‌పాషా, అంగోతు నక్క, కందిమళ్ల నరేంద్ర, కందిమళ్ల మనోజ్, కేళావత్ శ్రీకాంత్, సారా విష్ణులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోదావరిలో గల్లంతైన బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం

వేంసూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి వద్ద గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన ఖమ్మంజిల్లా వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి పామర్తి దినేష్(23) మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమైంది. శనివారం వాడపల్లిలో దైవదర్శనానికి స్నేహితులతో కలిసి వెళ్లిన దినేష్ గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే. గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం సాయంత్రం దినేష్ మృతదేహం లభ్యమైంది. దినేష్ మృతితో కుటుంబసభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

భట్టిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మధిర, జూలై21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కమీషన్ల రాజు అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ విమర్శించారు. సోమవారం మధిరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధిర పట్టణ అబివృద్ధి కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భారీగా నిధులు తీసుకువచ్చి పనులు చేస్తుంటే ఓర్వ లేని కమల్‌రాజు భట్టి పై అవాకులు చెవాకులు పేలుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, కర్నాటి రామారావు, నిడమానూరు వంశీ, అద్దంకి రవికుమార్, ఆవుల కిరణ్, పులిబండ్ల చిట్టిబాబు, బుచ్చిరామయ్య పాల్గొన్నారు.

పైలాన్ నిర్మాణానికి శంకుస్థాపన

ముదిగొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వెంకటాపురంలో పీపుల్స్ మార్చ్ పేరిట మల్లు భట్టి విక్రమార్క చేసిన 1,364కిలోమీటర్ల పాదయాత్రకు గుర్తుగా పైలాన్ నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ మండల నాయకులు గుడిపూడి బుచ్చిరామయ్య, ఝాన్సీరాణి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీలు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, నాయకులు సామినేని వెంకటయ్య, కందిమళ్ల వీరబాబు పాల్గొన్నారు.

వర్షం.. రైతుల హర్షం

» వరద కోతకు గురైన పంటలు

చింతకాని, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వర్షాలు లేక దిగాలు పడుతున్న రైతులకు భారీ వర్షం ఊరటనిచ్చింది. పొలాల మీద వరద పారడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామ సమీపంలోని వాగు పొంగి వరద పంట పొలాల మీదుగా వెళ్లడంతో గ్రామానికి చెందిన కౌలు రైతు బత్తుల సాంబయ్యకు చెందిన పత్తి పంట కోతకు గురైంది. కౌలుకు తీసుకున్న రెండు ఎకరాల్లో సుమారు ఎకరం పొలం వరద కోతకు గురవడంతో రైతు సాంబయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిండంతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

సత్తుపల్లిరూరల్, జూలై21 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో సోమవారం మధ్యాహ్నం నుంచి కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వగా కాలువలు, చెరువులలో నీరు ఇప్పుడిప్పుడే చేరుకుంటున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాలలో డ్రైనేజీల పైనుంచి మురుగు నీరు పారగా రోడ్లపై వరదనీరు పారింది. మండలంలోని ఆయా గ్రామాలలో డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలోకి వర్షపు నీరు చేరగా దోమలు వ్యాప్తి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇవే వర్షాలు కురిసినట్లయితే వ్యవసాయ పనులు ఊపందుకుంటాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడగా నీటిని తోడేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సరఫరాకు ఆయా ప్రాంతాలలో కాసేపు అంతరాయం ఏర్పడింది. బేతుపల్లి పెద్ద చెరువు పూర్తి నీటి సామర్థ్యం 16అడుగులు కాగా 12కు చేరుకున్నట్లు ఐబీ డీఈఈ మరియన్న తెలిపారు.

మధిర, జూలై21(ఆంధ్రజ్యోతి): మధిర మండల వ్యాప్తంగా సోమవారం జోరున వర్షం కురిసింది. రెండు రోజులుగా అక్కడా ఇక్కడ వర్షం కురియగా నేడు మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. గత పదిహేను రోజులుగా వర్షం కోసం ఎదురు చూసిన రైతులకు ఈ వర్షాలు ఉపశమనాన్ని ఇచ్చాయి. మండలంలో అనేక వాగులు పొంగి పోర్లాయి. మల్లారంలో నల్లవాగు ఉధృతికి గేదెలు కొట్టుకుపోయాయి. మధిర పట్టణంలో అనేక నాలాలు పొంగి పొర్లగా మురుగునీరు రోడ్లపైకి చేరింది.

తల్లాడ, జూలై21(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో సోమవారం భారీవర్షం కురిసింది. మండలంలోని వరి, పత్తి, పెసర పైర్లకు ఊరట నిచ్చింది. మండలంలోని దిగువనున్న పైర్లలో వర్షపునీరు నిలిచింది. తల్లాడలోని జాతీయ రహదారులోల వరద పోటెత్తడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. మండలంలోని చెరువులు, కుంటల్లోకి వరదనీరు వచ్చి చేరింది.

వర్షాల వరద ఉధృతికి తల్లాడ మండలంలోని మాచవరం వాగు పొంగి ప్రవహిస్తుంది. దీంతో తల్లాడ మండలం బిల్లుపాడు-రామచంద్రపురం గ్రామాల మధ్యన ఉన్న వంతెన నీటి మునిగి సోమవారం రాత్రి రాక పోకలు స్తంభించినాయి. వాగుకు ఇరువైపుల ఉన్న పంట పొలాలు నీటమునిగాయి.





వరద కోతకు గురైన పొలాన్ని చూపుతున్న రైతు సాంబయ్య



సత్తుపల్లిలో కురుస్తున్న భారీవర్షం



తల్లాడ పెసర పైరులో నిలిచిన వర్షపు నీరు



వర్షంలో ఆటలు ఆడుతున్న చిన్నారులు

అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మారుస్తాం

» డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

బోనకల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల, రావినూతల గ్రామాల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన నిధులతో వేయనున్న అంతర్గత రహదారులకు సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. గ్రామాల్లోని ప్రజలు పలు సమస్యల పై ఆయనకు వినతిపత్రాలను అందజేశారు. గ్రామాల్లో అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చేందుకు గానూ ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, కర్నాటీ రామకోటేశ్వరరావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, మోదుగు సుదీర్, ములకారపు రవి, గూడ నర్సయ్యశాస్త్రీ, అనుమోలు వెంకటేష్, బీపీ నాయక్, భద్రు నాయక్, వై. హేమూన్, వట్టికొండ రామకృష్ణ, తమ్మారపు బ్రహ్మయ్య, నల్లమోతు సత్యనారాయణ, తదితరులున్నారు.



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

వర్షాలు పడాలి.. సమృద్ధిగా పంటలు పండాలి



సత్తుపల్లిలో బోనాలతో తరలివస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, జూలై21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరుకున్నారు. మండలంలోని రుద్రాక్షపల్లిలో సోమవారం నిర్వహించిన బోనాల జాతర వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి పాల్గొన్నారు. ముత్యాలమ్మతల్లి అమ్మవారి వద్దకు బోనాలను నెత్తినెత్తుకుని తరలివెళ్లారు.

కారేపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వెంకటసాయినగర్‌లో సోమవారం గ్రామస్థులు ఆషాడబోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తినపెట్టుకోని ప్రదర్శనగా గ్రామదేవతఅయిన ముత్యాలమ్మవద్దకు తీసుకవచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో చందవత్ లక్ష్మణ్, రాంబాబు, కర్ణ, శంకర్, నాగేశ్వరరావు, నాగేష్, సర్వన్, ఈశ్వర్, తారాచంద్,వీరు నాయక్, తదితరులున్నారు.



కారేపల్లిలో...

బాధితులకు మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ

సత్తుపల్లిరూరల్, జూలై21 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలో మృతిచెందిన పలు కుటుంబాలను సోమవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. సత్తుపల్లి లారీ ఓనర్స్ యూనియన్ సభ్యులు షేక్.మస్తాన్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా మసీద్ రోడ్డుకు చెందిన వంటమేస్త్రి మట్టా ప్రసాద్ అనారోగ్యంతో మృతిచెందారు. వారి భౌతికకాయాలను సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ ఛైర్మన్ కూసంపూడి మహేష్, నాయకులు చాంద్‌పాషా, అద్దంకి అనిల్, వల్లభనేని పవన్, పర్వతనేని వేణు, నడ్డి ఆనందరావు, మేకల నరసింహారావు, గుండ్ర రఘు, గాదె సురేష్, మిద్దే శ్రీను, వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ కృష్ణ, బాబు, రామిశెట్టి కృష్ణ తదితరులు ఉన్నారు.

కల్లూరు: మండలంలోని ముచ్చవరం గ్రామ మాజీ సర్పంచు, బీఆర్ఎస్ నాయకుడైన గంగవరపు వెంకటేశ్వరరావు (శ్రీను) తండ్రి సూర్యనారాయణ సోమవారం ఆనారోగ్యంతో మృతి చెందారు. ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఫోన్ ద్వారా మాజీ సర్పంచ్ గంగవరపు వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూర్యనారాయణ భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, లక్కినేని రఘు, ఎస్‌కె కమ్లి, కిరణ్, సయ్యద్ రవూఫ్, మాజీ సర్పంచు రావి సూర్యనారాయణ, షర్రాబు వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.

తల్లాడ, జూలై21(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. మండలంలోని అంజనాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన గోసు నాగరత్నమ్మ కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముద్దనూరు గ్రామంలో మృతిచెందిన ఇనపనూరి పుష్పమ్మ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకటలాల్, సొసైటీ డైరెక్టర్ నలగొర్ల కృష్ణయ్య, కేతినేని చలపతిరావు, వజ్రాల రామిరెడ్డి, ఇనపనూరి అంబేద్కర్, గుమ్మడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న సండ్ర

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యా సమస్యకు పరిష్కారం కాదని, ఇందిరమ్మ ఇళ్లు రాలేదని ఎవరూ అధైర్యపడొద్దని, అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హామీ ఇచ్చారు. వైరా మునిసిపాలిటీలోని 14వ వార్డుకు చెందిన కట్ల నాగరాజు ఇందిరమ్మ ఇల్లు రాలేదని, ఇతర కారణాలతో ఆత్మహత్యకు ప్రయత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఫోన్ ద్వారా పరామర్శించారు. ఎమ్మెల్యే సూచన మేరకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ నాయకులు నాగరాజును పరామర్శించారు. రంగారావు ఫోన్ నుంచి చికిత్స పొందుతున్న నాగరాజుతో ఎమ్మెల్యే మాట్లాడి పరామర్శించారు. ఆత్మహత్యా సమస్యకు పరిష్కారం కాదని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎవరికి ఇళ్లు ఇవ్వకపోవడం వలన మొదటి విడతలో కొంత వత్తిడి ఉందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ అని అన్నారు. అనంతరం నాగరాజు చికిత్సకోసం కట్ల సంతోష్ రూ.ఐదువేలు ఆర్థికసాయం చేశారు. నాయకులు కట్ల నాగరాజు, సయ్యద్ అన్వర్, ముదిగొండ్ల మహేష్, రాము పాల్గొన్నారు.



నాగరాజును పరామర్శిస్తున్న రంగారావు

కాంగ్రెస్‌లో చేరికలు

కారేపల్లి: మండల పరిధిలోని పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, మాజీప్రజా ప్రతినిధులు సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి భట్టి కాంగ్రెస్ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అడప పుల్లరావు, మాజీ సర్పంచ్‌లు భూక్య రంగరావు, అంగోత్ మత్రు, శంకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల ఎన్నిక

కల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కల్లూరుకు చెందిన సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ ఎంపికయ్యారు. . మధిరలో ఆదివారం జరిగిన ఆ పార్టీ జిల్లా మహాసభలలో ఆయన ఎంపికను సీపీఐ పార్టీ ఎన్నుకుంది. ఆయన ఎంపికతో వేము రాంబాబు, కృష్ణ, రాజశేఖర్, మాధవ్‌లు, పలు సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కారేపల్లి: సీపీఐ జిల్లా సమితి సభ్యులుగా మండలానికి చెందిన ఇద్దరు నాయకులు ఎన్నికయ్యారు. మధిర పట్టణంలో జరిగిన జిల్లా మహాసభలలో మండలానికి చెందిన మాధారానికి చెందిన పాపినేని సత్యానారాయణ, బాజుమల్లాయి గూడెం గ్రామానికి ఉంగారాల సుధాకర్ ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులకు జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, రైతు సంఘం జిల్లా నాయకులు పుచ్చాకాయల శ్రీనివాస్‌రావులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ముదిగొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సుతారీ మేస్త్రీకి తీవ్రగాయాలైన సంఘటన ముదిగొండ మండలం బాణాపురం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. బాణాపురం గ్రామానికి చెందిన శీలం ఉపేందర్‌రావు నేలకొండపల్లి మండలంలో సుతారీ పని కోసం ద్విచక్రవాహనంపై వెళ్లి మధ్యాహ్నాభోజనం కోసం తిరిగి ఇంటికి వస్తుండగా బాణాపురంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఖమ్మం నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఉపేందర్‌రావును చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. భార్య లక్ష్మీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబసభ్యులు, బంధువుల ఆందోళన

రోడ్డు ప్రమాదంలో ఉపేందర్‌కు తీవ్రగాయాలు కావడంతో న్యాయం చేయాలంటూ అతడి కుటుంబసభ్యులు సోమవారం ముదిగొండ-వల్లభి రహదారిపై ఆందోళన నిర్వహించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధం

» కాంగ్రెస్ శ్రేణులు

కల్లూరు, జూలై21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కల్లూరు ప్రాంతానికి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ శ్రేణులకు కాంగ్రెస్ నాయకులు సవాల్ చేశారు. కల్లూరు ఏఎంసీలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజదేవి, మండల నాయకులు లక్కినేని కృష్ణ, తక్కెళ్ళపాటి దుర్గాప్రసాద్, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పెద్దబోయిన శ్రీనువాసరావులు మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలకు ఏమాత్రం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందించలేదని విమర్శించారు. సత్తుపల్లి నియోజవర్గంలో నాటి ఎమ్మెల్యే సండ్ర శిలాఫల కాలు వేయగా తమ ఎమ్మెల్యే రాగమయి ప్రభుత్వం తరుపున నిధులు తెప్పించి వాటిని నిర్మించారని అన్నారు. పదేళ్ల పాలనలో చేయని అభివృద్ధిని రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యే రాగమయి చేసి చూపించిన ఘనత తమదేనని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూక్యా శివకుమార్‌నాయక్, ఆళ్లకుంట నరసింహారావు, ఎస్‌కే ఉస్మాన్, తురాబలి, మట్టా రామకృష్ణ, కేవీఆర్, బైర్ల కాంతరావు, పరిమి భరత్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న ఏఎంసీ ఛైర్మన్ నీరజాదేవి

పొలం పంపకాల్లో సోదరుల మధ్య వివాదం

» పత్తి పంటను ధ్వంసం చేయడంతో కేసు నమోదు

బోనకల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో అన్నదమ్ముల నడుమ పొలం పంపకాల్లో తలెత్తిన వివాదం చినికి చినికి గాలి వానలా మారింది. చివరకు సాగు చేసిన పత్తి పంటను సోమవారం ధ్వంసం చేయడంతో బాధిత రైతు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ పొదిలి వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ పత్తి పంటను సాగు చేశాడు. అతడి తమ్ముడు జాన్‌మీయాతో పొలం పంపకాల విషయంలో వివాదం నెలకొంది. పోలీస్ స్టేషన్లో పరస్పర ఫిర్యాదులు చేసుకోవడం, ఆ తరువాత పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుని రాజీ పడటం జరిగింది. కాని పొలాల రిజిస్ట్రేషన్ విషయంలో జాప్యం జరుగుతుండటంతో సహనం కోల్పోయిన జాన్‌మీయా అన్న సాగు చేసిన పత్తి పొలంలో మొక్కలను పీకేశాడు. దాదాపు 20 కుంటల భూమిలో పూత, కాపు దశలో ఉన్న పంట ధ్వంసం చేశాడని బాధిత రైతు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

» రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ రమేష్

తల్లాడ, జూలై21(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఈవీ రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కలిపించి పార్టీ వైపు ప్రజలను ఆకర్షించేలా చూడాలని కోరారు. ఈకార్యక్రమంలో గాదె కృష్ణారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు చల్లా నాగులు, రాయల రమేష్, కిరణ్, సాయిచంద్, వెంకటేశ్వర్లు, నరేష్, బస్విరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

బర్త్‌డే పార్టీ..ఆకతాయిలపై కేసు నమోదు

సత్తుపల్లిరూరల్, జూలై21 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజు పార్టీ నేపథ్యంలో న్యూసెన్స్ చేసిన 10మంది వ్యక్తులపై సత్తుపల్లి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ టీ.శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి మండలంలోని రుద్రాక్షపల్లిలో గ్రామానికి చెందిన దాసరి శ్రీధర్‌రెడ్డి తన పుట్టినరోజు పార్టీకోసం కొంతమందితో కలిసి మద్యం సేవించి అసభ్యకరమైన పాటలు పెట్టుకుని రోడ్డుపై డాన్స్‌వేస్తూ న్యూసెన్స్ చేశారు. చుట్టుపక్కల వారితో పాటు బత్తుల భరత్‌కుమార్ ఇదేమిటని ప్రశ్నించగా నానాదుర్భషలాడుతూ చంపుతామని బెదిరంచారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాసరి శ్రీధర్‌రెడ్డి, దాసరి ప్రదీప్‌రెడ్డి, షేక్ జానీ, షేక్ అలీ, షేక్ జాన్‌పాషా, అంగోతు సక్య, కందిమళ్ల నరేంద్ర, కందిమళ్ల మనోజ్, కేళావత్ శ్రీకాంత్, సారా విష్ణులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భట్టిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిషోర్

మధిర, జూలై21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్ కమీషన్ల రాజు అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ విమర్శించారు. సోమవారం మధిరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధిర పట్టణ అబివృద్ధి కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భారీగా నిధులు తీసుకువచ్చి పనులు చేస్తుంటే ఓర్వ లేని కమల్‌రాజు భట్టి పై అవాకులు చెవాకులు పేలుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు కర్నాటి రామారావు, నిడమానూరు వంశీ, అద్దంకి రవికుమార్, ఆవుల కిరణ్, పులిబండ్ల చిట్టిబాబు, బుచ్చిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈతరం షార్ట్‌ఫిలిం చిత్రీకరణ ప్రారంభం

కొణిజర్ల,జూలై21(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం పెద్దగోపతిలో ఈతరం అను షార్ట్‌ఫిలిం చిత్రీకరణను సోమవారం ప్రారంభించారు. ప్రధాన పాత్రదారులుగా మొగిలి, వైదేహిలతో షార్ట్‌ఫిలింను ప్రారంభించారు. ఈ సందర్భంగా రచన, దర్శకత్వం వహిస్తున్న మొగిలి మాట్లాడుతూ కెరీర్ అంటూ వయస్సులో పెళ్లి చేసుకోని పిల్లల తల్లిదండ్రులు పడుతున్న అంతఃర్మదనాన్ని తెలిపే కథాంశంతో షార్ట్‌ఫిలింను రూపొందిస్తున్నట్లు తెలిపారు. కోడైరక్టర్‌గా రవితేజ్, ఉదయ్, ప్రొడక్షన్ మేనేజర్‌గా నాగసాయిలు వ్యవహరించారు. బొడ్డు నరసింహరావు, రాంబాబు, ప్రసాద్, శ్రీను, ప్రభాకర్, రాయప్ప, తిరుపతిరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చిత్రీకరణలో పాల్గొన్న షార్ట్‌ఫిలిం యూనిట్ సభ్యులు

గోదావరిలో గల్లంతైన బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం

వేంసూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి వద్ద గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన ఖమ్మంజిల్లా వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి పామర్తి దినేష్(23) మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమైంది. శనివారం వాడపల్లిలో దైవదర్శనానికి స్నేహితులతో కలిసి వెళ్లిన దినేష్ గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే. గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం సాయంత్రం దినేష్ మృతదేహం లభ్యమైంది. దినేష్ మృతితో కుటుంబసభ్యులు, బంధువులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

పైలాన్ నిర్మాణానికి శంకుస్థాపన

ముదిగొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వెంకటాపురంలో పీపుల్స్ మార్చ్ పేరిట మల్లు భట్టి విక్రమార్క చేసిన 1,364కిలోమీటర్ల పాదయాత్రకు గుర్తుగా పైలాన్ నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ మండల నాయకులు గుడిపూడి బుచ్చిరామయ్య, ఝాన్సీరాణి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీలు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, నాయకులు సామినేని వెంకటయ్య, కందిమళ్ల వీరబాబు, పల్లపాటి కృష్ణ, ఆదినారాయణరెడ్డి, బాలచందర్, నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్, రమేష్, ధర్మానాయక్ పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ సాధించిన ఫొటోగ్రాఫర్



పెనుబల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదోవ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫొటోగ్రఫీ పోటీల్లో పెనుబల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ కొప్పుల గోపాలరావు గోల్డ్‌మెడల్ సాధించారు. కారాయిగూడెం గ్రామానికి చెందిన కొప్పుల గోపాలరావు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించిన అవార్డుల్లో కలర్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ఏపీలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మత్స్యకారుల జీవనశైలి, జీవనాధారంపై తాను తీసిన ఫొటోకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫొటోగ్రఫీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోపాలరావును ఫొటో అండ్ వీడియో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల నర్సింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సతీష్, మధు, భద్రం, కృష్ణచైతన్య అబినందించారు.



గోపాలరావుకు గోల్డ్‌మెడల్ తెచ్చిన ఫొటో